ప్రజాశక్తి
గురువారం 23 ఫిబ్రవరి 2023 8 పేజీలు


ప్రకాశం


బాపట్ల

అత్యాచారం చేసి..! చిల్లకంపలో పడేసి..

- మత్తు మందిచ్చి.. బాలికపై అఘాయిత్యం!
- పోలీసుల అదుపులో అనుమానితులు..


నిందితుడికి దేహశుద్ధి చేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-మార్కాపురం

మత్తు మందు కలిపిన పానీయం ఇచ్చి.. ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం బాలికను చిల్లకంప చెట్లలో పడేశారు. ఈ ఘటన మార్కాపురం పట్టణంలోని కొండారెడ్డి కాలనీలో మంగళవారం చోటు చేసుకోగా... బుధవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. బాలిక బంధువులు తెలిపిన సమాచారం మేరకు.. కొండారెడ్డి కాలనీకి చెందిన 15 ఏళ్ల బాలిక తల్లిదండ్రులతో కలిసి కూలి పనులకు వెళుతోంది. 9వ తరగతి వరకు చదువుకున్న ఈ బాలిక ఈ ఏడాది బడి మానేసింది. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో నన్ని బుడీ అనే మహిళ ఈ బాలికకు కొండారెడ్డి కాలనీలో తారసపడింది. తనకు కళ్లు తిరుగుతున్నాయని, నీరసంగా ఉందని, తనను తన ఇంటికి తీసుకెళ్లాలని చెప్పింది. నన్ని బుడీ మాటలు నమ్మిన బాలిక ఆమెను ఇంటికి చేర్చేందుకు చేయిపట్టుకుని నడిపించుకుంటూ వెళ్లింది. ఓ ఇంటి వద్దకు చేరుకుంది. అక్కడ మంచినీళ్లు తాగమని బాలికకు నన్నీబుడి ఇచ్చింది. ఆ నీటిని తాగిన బాలిక మత్తులోకి జారుకుంది. ఆ తరువాత ఏమి జరిగిందో తనకు తెలియదని, రాత్రి ఎనిమిది గంటల సమయంలో కొండారెడ్డి కాలనీకి దూరంగా ఉన్న చిల్లకంప చెట్ల మధ్యలో పడి ఉన్నానని బాధిత బాలిక తెలిపింది. చిల్లకంప చెట్ల మధ్యన పడి ఉన్న బాలిక స్పృహలోకి వచ్చిన తరువాత ఇంటికి చేరుకుంది. జరిగిన ఉదంతాన్ని తల్లిదండ్రులకు వివరించింది. ఈ ఘటనకు అదే కాలనీకి చెందిన మహిళ నన్ని బుడీ కారణమని తెలియడంతో ఆమెను బాలిక బంధువులు నిలదీశారు. ఆమెతో సన్నిహితంగా మెలిగే షేక్ సలాం దీనంతటికీ కారణమని స్థానికులు అనుమానించారు. బుధవారం ఉదయం ▶ 2లో

మీ సమస్యలే మా అజెండా

- శాసనమండలిలో మీ 'గొంతుక' అవుతాం..!
- పి.బాబురెడ్డి, మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి నామినేషన్
- సంఘీభావం ప్రకటించిన విఠపు, లక్ష్మణరావు
- తరలొచ్చిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు
- చిత్తూరులో వేలాదిమందితో ర్యాలీ, సభ


చిత్తూరులో నామినేషన్ సందర్భంగా భారీ ర్యాలీ

ప్రజాశక్తి-చిత్తూరు ప్రతినిధి

'నాలుగేళ్లుగా పిఆర్‌సి ఇవ్వలేదు, డిఎలు ఇవ్వలేదు కనీసం జీతాలు కూడా ఒకటో తేదీ వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.. ఆఖరుకు ఒక్క డిఎస్‌సి కూడా ప్రకటించలేదు.. ఏం ముఖం పెట్టుకొని ఎంఎల్‌సి ఓట్లడిగేందుకు అధికార పార్టీ వస్తుంది.. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యలను శాసనమండలిలో వినిపిస్తాం.. మీ సమస్యలే మా అజెండా' అంటూ పిడిఎఫ్ అభ్యర్థులు పి.బాబురెడ్డి, మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంఎల్‌సిలు విఠపు బాలసుబ్రమణ్యం, లక్ష్మణరావు ఉద్ఘాటించారు. సూర్యుడు తూర్పున వాదయిస్తాడనేది ఎంత వాస్తవమో, పిడిఎఫ్ అభ్యర్థుల విజయం అంతే వాస్తవమని అన్నారు. 'పదండి ముందుకు.. పదండి తోసుకు' అంటూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు వేలాదిగా జిల్లాకేంద్రమైన చిత్తూరుకు తరలివచ్చారు. పోరాటాల పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలనే ఆశయం వారి ముఖాల్లో కనిపించింది. వారి రాకతో కట్టమంచి ప్రాంతం జనసంద్రమైంది.

తూర్పు, రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎంఎల్‌సి స్థానానికి పోటీ చేసేందుకు పిడిఎఫ్ అభ్యర్థులు పి.బాబురెడ్డి, మీగడ వెంకటేశ్వరరెడ్డి బుధవారం ఉదయం నామినేషన్ దాఖలు చేశారు. తమ ఉద్యమ గొంతుకలను గెలిపించేందుకు ఉదయం ఎనిమిది గంటలకే ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. పిల్ల కాలువలన్నీ సముద్రంలో కలిసినట్లు చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి యుటిఎఫ్, ఎస్‌టియు, టిటిడి ఇతర ఉపాధ్యాయ, కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జనం కదిలొచ్చారు. పదిన్నర గంటల ప్రాంతంలో ర్యాలీ ప్రారంభమయ్యింది. పిడిఎఫ్ ఎంఎల్‌సిలు విఠపు బాలసుబ్రమణ్యం, లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్. ప్రసాద్, సిఐటియు రాష్ట్ర నాయకులు కందారపు మురళి, ఎంఎల్‌సి అభ్యర్థులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, పి. బాబురెడ్డి, ఎస్‌టియు రాష్ట్ర నాయకులు శ్రీదేవీ, ఎఐటియుసి నాయకులు రామానాయుడు, మురళిలు ప్రదర్శన ముందు భాగాన నడవగా మిగిలిన కార్మికులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు వారి వెంట నడిచారు. కట్టమంచి చెరువు నుంచి గాంధీవిగ్రహం వరకు దాదాపు రెండు కిలోమీటర్ల పొడవు ర్యాలీ ముందుకు సాగుతూ వెళ్లింది. ఈ సందర్భంగా లాంగ్ లీవ్ పిడిఎఫ్.. గెలవాలి.. గెలవాలి పిడిఎఫ్ అభ్యర్థులు గెలవాలి.. విజయం ఉద్యమ అభ్యర్థులదే. అంటూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీ హైరోడ్డు మీదుగా గాంధీవిగ్రహం, ఎంఎస్ఆర్ కూడలి మీదుగా నాగయ్య కళాక్షేత్రం వరకు సాగింది. అనంతరం అక్కడ బహిరంగ సభ జరిగింది. సభ మధ్యలో ఎంఎల్‌సి అభ్యర్థులు ఇరువురూ వెళ్లి ▶ 2లో

ఒక్క తడి కోసం..

- నీటి కోసం నోళ్లు తెరుస్తున్న మిర్చి, మొక్కజొన్న పొలాలు
- లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టి ఎదురుచూస్తున్న రైతులు
- రోజుల తరబడి కాలువగట్లపై ట్రాక్టర్ మోటార్లతో నిరీక్షణ
- వెంకటాపురం సమీపంలో కాలువపైనే ఎన్ఎస్‌పి ఏఈతో రైతు నేతల చర్చలు


మిర్చి పంటను పరిశీలిస్తున్న రైతుసంఘం, కౌలురైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-పంగులూరు

లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పొలాలు చివరిదశకు వచ్చేసరికి సాగునీరు అందకపోవటంతో రైతులు కలవరపడిపోతున్నారు. ఈ ఒక్క తడి వస్తే.. కనీసం తమ పెట్టుబడులైనా దక్కించుకోవచ్చని సాగర్ కాలువ వైపు ఆశతో ఎదురుచూస్తున్నారు. మూడు రోజులుగా రేయింబవళ్లు పొలంగట్లపైనే ట్రాక్టర్ ఇంజన్లతో ఉంటున్నా.. చుక్కనీరు కూడా రాక నిరాశతో నిట్టూరుస్తున్నారు.

మండలంలోని నూజిలపల్లిలో ఈ సంవత్సరం సుమారు 800 ఎకరాల్లో మిర్చి, 200 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. మిర్చి గత రెండు నెలల క్రితం కురిసిన అధిక వర్షాల వల్ల కొంత దెబ్బతినిపోయింది. తరువాత తామర పురుగు వల్ల పైర్లు దెబ్బతిని పోతున్నా.. విపరీతమైన ఖర్చుతో నాణ్యమైన మందులు వాడి ఏదో ఒక విధంగా మిర్చి పైరును కాపాడుకున్నారు. ఇప్పుడు చివరి నీటితడి వస్తే.. ఇక కాయలు కోసుకోవచ్చని రైతులు ఆశపడుతున్నారు. మొక్కజొన్న కూడా నీటి తడి అవసరం. ఇప్పుడు తడి వేయకపోతే కండెలోని గింజలు మొత్తం తాలు గింజలుగా మారిపోతాయని రైతులు బాధపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కాలువ నీళ్లు పెట్టుకునేందుకు కాలువగట్లపై ట్రాక్టర్ మోటార్లు ▶ 2లో


ట్రాక్టర్ మోటర్లతో నిరీక్షిస్తున్న రైతులు

ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్ల నియామకం

ప్రజాశక్తి-ఒంగోలు ప్రతినిధి: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ముగ్గురు అబ్జర్వర్లను నియామకం చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రకాశం, నెల్లూరు. చిత్తూరు గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులుగా కె.సునీత ఐఏఎస్, ప్రకాశం- నెల్లూరు- చిత్తూరు ఉపాధ్యాయ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులుగా కోన శశిధర్ ఐఏఎస్‌ను, స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల పరిశీలకులుగా బి. శ్రీధర్ ఐఏఎస్‌ను నియమించింది.

అశ్రుతాంజలి



మీరంటే అన్నదమ్ములకు ధైర్యం,
మీరంటే అక్కచెల్లెళ్లకు ప్రేమ, మీరంటే బావమరుదులకు
అండ, ఎప్పుడూ మమ్మలను కనిపెట్టుకుంటూ
ఉండే మీరు ఈ రోజు మా మధ్య లేకపోవడం
మాకు బాధాకరం. మీరు మాతో గడిపిన క్షణాలు
మాకు మధురస్మృతులు. మీరు నేర్పిన విలువలతో
కూడిన జీవనాన్ని గడుపుతూ, మీ ఆశయాలను
ముందుకు నడిపించి,
మీ స్ఫూర్తిని తరువాతి తరాలకు కూడా అందజేస్తాము.
మీరు సదా మమ్ములను కనిపెట్టుకుంటూఉండి
సరైన బాటలో నడిపిస్తారనే
గట్టి నమ్మకంతో అశ్రుతాంజలి ఘటిస్తూ....

కీ॥శే॥ లింగిశెట్టి సుబ్బారావు గారు
(మాజీ చైర్మన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పర్చూరు)
నిర్యాణం : 09-02-2023

కుటుంబ సభ్యులు
మరియు బంధుమిత్రులు

పెద్దకర్మ:- ది 23-02-2023 గురువారం నాడు పర్చూరు లోని
మా స్వగృహం నందు జరుగునని తెలియపరచడం అయినది

ఒక్క తడి కోసం..

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుకొని, పొలాల్లో పైపులు పరుచుకొని కూలీలకు రోజుకు వెయ్యి రూపాయలు కూలి ఇచ్చి.. భోజనం ఖర్చులు మొత్తం పెట్టుకొని.. నీళ్లు పెట్టుకునేందుకు రైతులు సిద్ధమైనా.. కాలువలో మాత్రం నీళ్లు రావట్లేదు.

రైతు నాయకుల పరిశీలన

పరిస్థితి గమనించిన రైతుసంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిని వినోద్‌బాబు రైతులతో మాట్లాడి, బుధవారం మిర్చి, మొక్కజొన్న పొలాలను పరిశీలించారు. మరో రోజుల్లో వారాబందీ ముగియనుండటంతో అధికారులతో తేల్చుకునేందుకు అద్దంకిలోని ఎన్ఎస్‌పి ఆఫీసుకు బయలుదేరారు. వెంకటాపురం గ్రామ సమీపంలో ఉన్న సాగర్ కాలు వద్ద ఉన్న ఏఈ సునీల్ రైతులతో మాట్లాడారు.

మరో మూడు రోజుల పాటు నీళ్లివ్వాలి

తమ పొలాలు పూర్తిగా తడిచేందుకు మరో మూడు రోజుల పాటు సాగర్ నీళ్లు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. మెయిన్ కెనాల్‌లోనే నీటి ప్రవాహం తగ్గిందని, ఏబిసి హెడ్ దగ్గర 900 క్యూసెక్కులు రావాల్సి ఉండగా.. 700 మాత్రమే వస్తున్నాయన్నారు. రాత్రి సమయాల్లో కాలువలో నీటిపారుదలు తగ్గుతుందని, పమిడిపాడు మేజర్‌కు 40 క్యూసెక్కులు మాత్రమే వస్తున్నాయని తెలిపారు. అందువల్ల పూర్తిస్థాయిలో నీళ్లు రావడం లేదని ఏఈ సునీల్ చెప్పారు. రైతులు తమకు సహకరించి తమ వెంట ఉంటే పమిడిపాడు మేజర్‌కు 300 క్యూసెక్కులు తీసుకొస్తామని, అప్పుడు ఇబ్బంది లేకుండా ఉంటుందని పేర్కొన్నారు. అధికారులకు తోడుగా తాము రాత్రిపూట వస్తామని, 300 క్యూసెక్కులు వచ్చే విధంగా, మూడు రోజుల పాటు నీళ్లు నిరాటకంగా వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

చివరి భూమి వరకు నీరిచ్చేందుకు చర్యలు

లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టి, సాగునీటి కోసం ఆశతో ఎదురుచూస్తున్న రైతులను నిరాశపరచకుండా, చివరి ఎకరం వరకు సాగునీరు అందించాలని రైతుసంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిని వినోద్‌బాబు డిమాండ్ చేశారు. ప్రస్తుతం కాలువ ఎగువ భాగాన సాగునీటి అవసరం లేకపోయినా.. ఈ ప్రాంతంలో వారాబందీ పెట్టడం సరైంది కాదని, అధికారులు దీనిని విరమించుకొని ప్రతిరోజూ నీరివ్వాలని డిమాండ్ చేశారు. మెయిన్ కాలువలో రాత్రిపూట నీటిపారుదల తగ్గటం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావటం లేదని, అధికారులు సాగర్ నీటిని అమ్ముకోవడం వల్లనే ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుందని రామారావు, వినోద్ బాబు విమర్శించారు. ఇప్పటికైనా రైతుల కష్టాలను తెలుసుకొని సాగునీటి ఇబ్బందులు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మద్దినేని సురేషు, తానికొండ శాంసన్, కొల్లి రామచంద్రబాబు, కొలకలూరి సుబ్బారావు, కవల రాజేష్, కమ్మెల రాంబాబు, గొట్టిపాటి కష్ణమూర్తి పాల్గొన్నారు.

రూ.15 లక్షల పెట్టుబడి పెట్టాం..

కవల రాజేష్, కౌలు రైతు

నేను ఈ సంవత్సరం 10 ఎకరాల కౌలుభూమి తీసుకొని మిర్చి సాగు చేశా.. ఇప్పటివరకు 15 లక్షల రూపాయల వరకు పెట్టుబడి అయ్యింది. మూడు రోజుల నుండి కూలీలను పెట్టుకొని నీళ్లు పెట్టుకునేందుకు ప్రయత్నం చేస్తున్నా.. అరెకరం కూడా తడవలేదు. ఎకరాకు 6, 7 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పుడైనా సాగర్ నీరు అందితే.. కొంత ఉపయోగంగా ఉంటుందని ఆశిస్తున్నా..

నీళ్లు రాకుంటే కష్టమంతా వృథా

మద్దినేని సురేష్, రైతు

నేను చిన్న రైతునే.. కౌలు భూమితో కలుపుకొని మొత్తం 30 ఎకరాలు సాగు చేస్తున్నా.. మిర్చికి ఎకరాకు లక్షన్నర, మొక్కజొన్నకు ఎకరాకు 50 వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టా... మిర్చి, మొక్కజొన్నకు ఇప్పుడు నీటి అవసరం ఉంది. ఈ దశలో నీళ్లు రాకపోతే ఇప్పటివరకు మేము చేసిన కష్టమంతా వథా అవుతుంది. అధికారులు ఇప్పటికైనా ఒక తడికి నీరిచ్చి మమ్మల్ని ఆదుకోవాలి.

ప్రజలు సంతోషంగా ఉన్నారు : కరణం

ప్రజాశక్తి- చీరాల


మాట్లాడుతున్న కరణం వెంకటేష్‌బాబు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనతో రాష్ట్ర ప్రజలందరూ సంతప్తిగా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నారని వైసిపి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు తెలిపారు. మండల పరిధిలోని రామకష్ణాపురంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావు, వైస్ చైర్మన్లు బొనిగల జైసన్ బాబు, రామ సుబ్బులుతో కలసి బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమది మాటలు చెప్పే ప్రభుత్వం కాదని తెలిపారు. ఇచ్చిన మాటను చేసి చూపించే ప్రభుత్వమని తెలిపారు. ఆ దిశగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. గడప గడపకూ కార్యక్ర మంలో ఇంటింటికీ తిరుగుతున్నప్పుడు ప్రజలు రాష్ట్ర ప్రభుత్వంపై తమ అభిమానం తెలుపు తుంటే ఎంతో సంతప్తిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు,పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లీ వైష్ణవి, కొలుకుల వెంకటేష్, యాతం మేరీ బాబు,మున్సిపల్ కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అత్యాచారం చేసి.. చిల్లకంపలో పడేసి..

(మొదటిపేజీ తరువాయి)

కొండారెడ్డి కాలనీకి వెళ్లిన సలాంను స్థానికులు, బాలిక బంధువులు చుట్టుముట్టారు. దేహశుద్ధి చేసిన అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. వైద్య పరీక్షల నిమిత్తం బాధితురాలితో పాటు అనుమానితుడు సలాంను మార్కాపురంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. బాలికకు తారసపడ్డ నన్ని బుడీని పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అత్యాచారం జరిగిందా? లేదా? అనే విషయం పోరోనిక్స్ ల్యాబ్ నివేదికపై ఆధారపడింది. ఈ కేసును పట్టణ మహిళా ఎస్ఐ సువర్ణ దర్యాప్తు చేస్తున్నారు.

మీ సమస్యలే మా అజెండా

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టరేటులో నామినేషన్లను దాఖలు చేశారు.

పిడిఎఫ్‌దే విజయం

గతంలో లాగే ఈ సారీ పిడిఎఫ్ అభ్యర్థులే ఈ తూర్పు రాయలసీమ ప్రాంతంలో విజయం సాధించనున్నారని, ఇందులో ఎలాంటి సందేహం లేదని పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. పీడిఎఫ్ ఎంఎల్‌సిల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నాగయ్య కళాక్షేత్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక, విద్యార్థి, యువజన వేదిక ఆధ్వర్యంలో 'జాతీయ విద్యా విధానం.. రాష్ట్ర విద్యారంగంపై పరిణామాలు' అనే అంశంపై సదస్సు జరిగింది. జేవివి రాష్ట్ర అధ్యక్షులు మురళిధర్ అధ్యక్షత వహించారు. నాగయ్య కళాక్షేత్రంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు భారీ ఎత్తున కార్లతో ర్యాలీ నిర్వహిస్తే.. తాము జనం కాళ్లతో మట్టిపై ర్యాలీ నిర్వహించామని తెలిపారు. తమ నిరాడంబరతకు ఇదే నిదర్శనమని చెప్పారు. గతం కన్నా తమకు బలం పెరిగిందని, ఈ సారి భారీ ఎత్తున ప్రయివేటు ఉపాధ్యాయులు మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. ఎంఎల్‌సి లక్ష్మణరావు మాట్లాడుతూ వైసిపి ఏ ముఖం పెట్టుకుని ఉపాధ్యాయులను, ఉద్యోగులను ఓట్లు అడుగుతుందని ప్రశ్నించారు. నాలుగేళ్లుగా పిఆర్‌సి ఇవ్వలేదు, డిఎలు ఇవ్వలేదు కనీసం జీతాలు కూడా ఒకటో తేదీ వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని దుయ్యబట్టారు. ఆఖరుకు ఒక్క డిఎస్‌సి కూడా ఇవ్వలేకపోయారని వాపోయారు. అధికార పార్టీ ఏకంగా శాసనమండలిని రద్దు చేస్తామని చెప్పి, ఇపుడు అభ్యర్థులను పోటీకి పెట్టడం వారి ద్వందరీతికి నిదర్శనమన్నారు. సిఐటియు రాష్ట్ర నాయకులు కందారపు మురళి మాట్లాడుతూ సూర్యుడు తూర్పున ఉదయిస్తాడనేది ఎంత వాస్తవమో, పిడిఎఫ్ అభ్యర్థుల విజయం కూడా అంతే వాస్తవమని తెలిపారు. పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ మూడు జిల్లాలోని ఓటర్లను కలిసే శక్తి సామర్థ్యాలు ఒక్క పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్దతు ఇస్తున్న ప్రజా సంఘాలకు మాత్రమే ఉందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, సిపిఎస్ రద్దు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వందవాసి నాగరాజు, చిత్తూరు జిల్లా సిఐటియు నాయకులు వాడ గంగరాజు, అన్నమయ్య జిల్లా సిఐటియు నాయకులు శ్రీనివాసులు, చిత్తూరు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయచంద్ర, ఐద్వా నాయకురాలు సాయి లక్ష్మి, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జివి రమణ, ఎఐటియుసి నాయకులు మురళి, నాగరాజు, రైతు సంఘం నాయకులు రామానాయుడు వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, ఉమ్మడి చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జిల్లా కమిటీ సభ్యులు, ఎస్‌టియు నాయకులు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నోటీసు

మహారాజశ్రీ దరిశి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
IA 406/2021 O.S.No.112/2013
కట్ల వెంకటేశ్వర్లు వగైరాలు ... వాదులు/పిటిషనర్‌లు
V/S
కొంకా తిరుపతమ్మ వగైరాలు ... ప్రతివాదులు/రెస్పాడెంట్లు
To
R6 : కొంకా మౌనిక, భర్త:శ్రీనివాసరావు, పెద్దఉల్లగల్లు గ్రామం, ముండ్లమూరు మండలం, ప్రకాశం జిల్లా.
పై నంబరు దావాలో రిస్టోరు పిటిషను దాఖలు చేయుటలో జరిగిన ఆలస్యం మన్నించమని కోరి మీపై పిటీషన్ దాఖలు చేసి ఉన్నాడు. కనుక మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తే.28.02.2023 ది ఉదయం గం॥10.30 ని॥లకు పై కోర్టువారి ఎదుట హాజరై తెలుపుకొనవలెను.లేకున్న మీకు పరోక్షముగా తీర్మాణం కాబడును.
వాయిదా తేది : 28-02-2023
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వడ్డమాని శ్రీనివాసశాస్త్రి
అడ్వకేట్, దరిశి, ప్రకాశం జిల్లా, ఏ.పి
దరిశి
తేది:22-02-2023
సెల్: 9440109385

మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
OS No : 244/2022
Between
కన్నెగంటి వాసుబాబు ...వాది
మరియు
మువ్వల సుబ్రహ్మణ్యం .... ప్రతివాది
S/o అంజనేయులు (లేటు) డోర్ నెం 14-107
గోల్డ్ షాప్ రోడ్డు, పర్చూరు ,పర్చురు మండలం,
బాపట్ల జిల్లా,
పై నెంబరు గల దావాను మీపై దాఖలు చేసి మీకు ఎన్నిమార్లు దావా సమనులు పంపిననూ చేరనందున ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా ది.24-02-2023 న ఉదయం గం 10.30 ని.లకు వాయిదా ఉన్నందున మీరు స్వయముగా గానీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదురు హాజరయి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది లేని ఎడల మీ పరోక్ష మునందు విచారించి తీర్మానించబడును
(కోర్టు వారి అనుమతితో)
వాయిదా తేది 24-02-2023
వెంగలశెట్టి తిరుమలరావు
కారుమూడి ధనలక్ష్మి
న్యాయవాదులు, పర్చూరు.

మహారాజశ్రీ దరిశి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.పి.నెం.18/2019
బంకా ఆంజనేయులు ..... పిటీషనర్
వర్సెస్
పగడాల నాగమణి @ నాగమ్మ మరియు ఇతరులు ....రెస్పాండెంట్లు
టు
రెస్పాండెంటు నెం. 1
పగడాల నాగమణి @ నాగమ్మ, భర్త చంద్రయ్య
ఆర్/ఓ. బంగారమ్మ బావి దగ్గర, పొట్టిశ్రీరాములు వీధి, దరిశి గ్రామం & మండలం,
ప్రకాశం జిల్లా.
పై నెంబరు గల పిటీషన్‌లో కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్టు ద్వారా మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ మీరు తీసుకొనక ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. అందువలన శ్రీకోర్టు వారు పై పిటీషన్‌లో మీ యొక్క నోటీసులు నిమిత్తం తేది 28-02-2023 వాయిదా వేసినారు. సదరు తేదిన మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా కానీ పై కోర్టులో ఉదయం గం॥ 10-30 ని॥లకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కొనవలసినది. లేని యెడల మీ పరోక్షమందు పై కేసు విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
వాయిదా తేది : 28-02-2023
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు) ఇట్లు
గడ్డి శ్రీనివాసులు,
పిటీషనర్ తరుపు న్యాయవాది
దరిశి, ప్రకాశం జిల్లా.

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

గుంటూరు జిల్లా, చిలకలూరిపేట కు చెందిన తాటిపర్తి జయరామిరెడ్డి, తండ్రి వెంకటప్పారెడ్డి ప్రకాశం జిల్లా, సంతనూతలపాడు సబ్. రి యిలాకా, పేర్నమిట్ట గ్రామ సర్వే నెం.106/1సీ రులో గల రిజిష్టర్డ్ విక్రయ దస్తావేజు నెం. 629/1986 రు ద్వారా 35 గదులు ఖాళీ స్థలము కొనుగోలు చేస యున్నాను. అయితే ఒరిజనల్ దస్తావేజు అయిన రిజిష్టర్డ్ విక్రయ దస్తావేజు నెం. 629/1986 రు తేది. 10-02-2023న సంతనూతలపాడు నుండి ఆటోలో ఒంగోలు కర్నూలు రోడ్డు ఫ్లైవోవర్ దగ్గరకు వచ్చి దిగి చూసుకొనగా కనపడలేదు. దస్తావేజులను ఎంత వెతికినా దొరకలేదు దొరికిన వారు ఈ క్రింది చిరు నామా గాని ఫోన్ నెంబర్ గాని తెలియ పరచవలసిన కోరుచున్నాను
ఇట్లు
తాటిపర్తి జయరామిరెడ్డి తండ్రి వెంకటప్పారెడ్డి,
చిలకలూరిపేట గ్రామం, చిలకలూరిపేటమండలం
గుంటూరుజిల్లా
సెల్ నెంబర్ 9440474645

మహారాజశ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెంబర్ 181/2022
వలేటి సుబ్రమణ్యం అలియాస్ వోలేటి సుబ్రమణ్యం గారు ... వాది
వర్సెస్
మంచికంటి వెంకట రంగ సుబ్బరాయుడు ...ప్రతివాది
టు,
మంచికంటి వెంకట రంగసుబ్బరాయుడు
తండ్రి శ్రీనివాసరావు, డోర్ నెం:6/41,
నక్కవారి వీధి, బేస్తవారిపేట గ్రామం మరియు మండలం, ప్రకాశం జిల్లా.
దావాసమను
పై నెంబర్ వాది దావా ప్రాంసరీ నోటు పరిహారమును రాబట్టే నిమిత్తం డిక్రీ కోరి నీ మీద దావాను పై వారి కోర్టులో దాఖలు చేయగా ప్రతివాది అయిన మీకు దావా సమను జారీ నిమిత్తము తేదీ: 24-02-2023 నకు వాయిదా కలదు. సదరు తేదీన మీరు ఉదయం 10:30 గంటలకు పై వారి కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపవలసినది. లేని యెడల మీపరోక్షమున తీర్మానించబడునని తెలుసుకొన వలయును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేదీ: 24-02-2023 ఇట్లు
తాటికొండ రామ్మోహన్‌రావు,
వాది తరుపు అడ్వకేట్, పొదిలి,
సెల్ :9885636729.

పబ్లిక్ నోటీస్

జొన్నలగడ్డ రోహిత్ చౌదరి వయస్సు సుమారుగా 10 సం" అయి మైనరైనందున మీ తల్లిగారిన గారైన జొన్నలగడ్డ అంజలి భర్త అంకమ్మరావును గార్డియన్ గా చూపి మీ స్వస్థల శాశ్వత చిరునామా కేరాఫ్ చింతల హుస్సేన్ తండ్రి పిచ్చయ్య, మైనంపాడు గ్రామ నివాసి, సంత నూతలపాడు మండలం ప్రకాశం జిల్లా, పై ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిన నూ కావలెని తీసుకొనుటకు నిరాకరించిన మిదట కోర్టు ఉత్తర్వుల మేరకు ఈ పబ్లికేషన్ నోటీసు వేయుచున్నాము మీకు ముఖ్యంగా తెలియజేయడం ఏమనగా .ఒంగోలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ,మీ మేనత్తగారైన కొమ్మాలపాటి అన్నపూర్ణ భర్త మురళి OS 11/18 అను పార్టిషను దావా ఆమె 1/5 వ వంతు భాగమునకై జొన్నలగడ్డ పెద్ద గోవిందయ్య మరి ఐదుగురిని ప్రతివాదులుగా చూపించు చూ వేసి యూన్నది పై దావాలో మీరు ఆరో ప్రతివాదిగాను మరియు ఇంజక్షన్ పిటిషన్ ను IA 15/18 రిసీవర్ పిటిషను IA 20/18 లలో ఆరో రెస్పాండెంట్ గా చేపబడి ఉన్నారు పై దావా మీ నోటీస్ నిమిత్త మై 24.02.2023 న వాయిదా వేయబడి ఉన్నది కావున మీరు గాని మీ తరపున లాయర్ గారి ద్వారా గాని ఉదయం 10:30 కి హాజరై సంజాయిషీ చెప్పుకొన ని ఎడల పై దావా OS 11/18 మరియు పిటిషన్లు IA 15/18 & IA 20/18 మీ పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్మానించేదరని ఇందుమూలముగా తెలియజేయడ మైనది
ఇట్లు
ముదివర్తి రాజారాం
ఎం.రాజ్యలక్ష్మి
అడ్వకేట్స్, ఒంగోలు
సెల్ నెంబర్ : 9440183051

ప్రజలను పక్కదారి పట్టించడం చంద్రబాబు నైజం

ఎమ్మెల్యే సుధాకర్ బాబు విమర్శ

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

సామాజిక న్యాయం అనే పదాన్ని కాగితాల్లో కాకుండా ఆచరణలో అమలు చేసిన సామాజిక విప్లవ కారుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని సంతనూతలపాడు ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకర్‌బాబు తెలిపారు. వైసిపి జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏదైనా మంచి పరిణామం జరిగినప్పుడు దాన్ని ప్రజల్లోకి వెళ్లకుండా విధ్వంసాలు సృష్టించడం ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడి నైజమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఎల్‌సి పదవుల్లో 80 శాతం బడుగుబలహీనవర్గాలు, దళిత, గిరిజనులకు కేటాయించి జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించాడని వివరించారు. ఈ మంచి పరిణామాన్ని ప్రజలు ఆలోచించకుండా వారిని పక్కదాని పట్టించేందుకే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

చంద్రబాబునాయుడు గన్నవరంలో విధ్వంసాలకు తెరతీశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఇలాంటి అరాచకాలు అనేకం చంద్రబాబు చేశాడని ఆరోపించారు. ప్రజలకు మంచి జరిగి, ప్రజల్లో వైసిపికి మంచి పేరు వస్తుందని భావించినప్పుడల్లా చంద్రబాబు రాష్ట్రంలో అల్లర్లకు పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలకు సీట్లు కేటాయింపులలో,మంత్రులకు పదవుల కేటాయింపుల్లో, ఎమ్మెల్సీ పదవులు కేటాయింపుల్లో దళిత, గిరిజనులు, బడుగు బలహీన వర్గాలకు వైసిపి ఇచ్చినంత ప్రాధాన్యత ఏనాడు తెలుగుదేశం పార్టీ ఇవ్వలేదన్నారు. మహిళలకు 50శాతం రిజర్వేషన్ అమలు చేసి అన్నీ రకాల పదవుల్లో వారికి పురుషులకంటే మిన్నగా అవకాశాలు కల్పించిన ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు. చంద్రబాబుకు దమ్ముంటే వైసిపి కంటే మెరుగైన అవకాశాలు దళిత, గిరిజనులు, బడుగుబలహీన వర్గాలకు, మహిళలకు కల్పించాలని సవాల్ విసిరారు. లోకేష్ పాదయాత్ర ఫ్లాప్ కావడంతో చంద్రబాబు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఎద్దేవ చేశారు. చంద్రబాబునాయుడు చేసే కుట్రలను వైసిపి శ్రేణులు తెలివిగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు దుంపా చెంచిరెడ్డి, వేమా శ్రీనివాసులు, నల్లమలపు కృష్ణారెడ్డి, ఇనగంటి పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

పశుపోషకులకు అవగాహన

మద్దిపాడు : పశువుల గొర్రెలు, మేకల రోడ్డు ప్రమాదాల నివారణకు పశుపోషకులు తీసుకో వలసిన జాగ్రత్తల గురించి జిల్లా సంయుక్త సమాచాలకులు డాక్టర్ బేబి రాణి అవగాహన కల్పించారు. మండల పరిధిలోని బూరెపల్లి గ్రామంలో పశుకాపరులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బేబిరాణి మాట్లాడుతూ పశుకాపరులు పశువులను రోడ్డు దాటించే సమయంలో వాటి ముందు వెనుక నిలబడి రోడ్డు దాటించాలన్నారు. కర్రలకు రేడియం స్టిక్కర్లు అంటించి వాహనాల రాక పోకలను ఆపివేయాలన్నారు. ఉప సంచాలకులు డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ పోటేళ్ల కొమ్ము లకు రేడియం స్టిక్కర్ లు అంటిస్తేవాహనాలు ఆగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు పి. రామారావు, బూరెపల్లి ఎంపిటిసి రమేష్, పశుపోషకులు పాల్గొన్నారు.

గుండ్లాపల్లిలో వైద్యపరీక్షలు

మద్దిపాడు : గ్రామాల్లోని పేదలకు వైద్యం అందించే ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో హర్షణీయమని గుండ్లాపల్లి ఎంపిటిసి పల్లకి పద్మకుమారి తెలిపారు. గుండ్లాపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మద్దిపాడు పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ మానస ఆధ్వర్యంలో బుధవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మానస చిన్నారుల బరువు, మానసిక పరిస్థితి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ నాగేశ్వరరావు, సిహెచ్ఒ కీర్తి లక్ష్మి, ఎఎన్ఎం రంజాన్ బేబి, ఎంపిహెచ్ఎ దారియా పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

చీరాల : విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షణ పొందేందుకు పరిశుభ్రతను పాటిస్తూ ప్రతి రోజూ రెండు పూటలా దంతాలను శుభ్రం చేసుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బాబూరావు తెలిపారు. వేటపాలెం మండలం రామాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో దంత వైద్యులు డాక్టర్ ప్రదీప్ పర్యవేక్షణలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి ఆరోగ్యం పట్ల పలు సూచనలను చేశారు. అనంతరం విద్యార్థులకు పేస్టులు, బ్రష్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధి పోలుదాసు రామకష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నారాయణమ్మ,గ్రామ పెద్దలు, పలువురు పాల్గొన్నారు.

26న తైక్వాండో పోటీలు

రేపల్లె : రేపల్లె జూనియర్ కళాశాల మైదనాంలో సబ్ జూనియర్ విభాగంలో 12, 14 సంవత్సరాల బాలబాలికలకు తైక్వాండో ఉమ్మడి గుంటూరు జిల్లాల చాంపియన్ చిప్ పోటీలు, రాష్ట్ర జట్టు ఎంపికలు ఈనెల 26న నిర్వ హిస్తున్నట్లు తైక్వాండో అసోసియేషన్ జిల్లా సెక్రటరీ కె.జగన్మోహన్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపి బాల బాలికలు మార్చి 10,11,12 తేదీల్లో విశాఖపట్నంలోని యలమంచిలిలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్ననున్నట్లు ఆయన తెలిపారు.

అభివృద్ధి పనులు పరిశీలన

చీరాల : సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటు ఉండి మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే కరణం బలరాం కష్ణమూర్తి అన్నారు. చీరాల మున్సిపాలిటీలోని 30వ వార్డులో నిర్వహిస్తున్న అభివద్ధి పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సెక్రటరీలు సమయపాలన పాటిస్తూ సచివాలయానికి వివిధ సమస్యలపై వచ్చే ప్రజల అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో 30వ వార్డు కౌన్సిలర్ కంపా అరుణ్, కట్టా రాము, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

బాపట్ల : కవితలు కథా రచనలను ప్రోత్సహిస్తూ సాంస్కృతిక వికాసానికి లైన్స్ క్లబ్ చేస్తున్న కషి అభినందనీయమని ప్రముఖ న్యాయవాది అలపర్తి నాగేశ్వర రావు తెలిపారు. బాపట్ల జిల్లా రచయితల సంఘం, రసరంజని, లయన్స్ క్లబ్ ఆఫ్ బాపట్ల టౌన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతభాషా దినోత్సవం సందర్భంగా ఆశు కథా రచనా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బుధవారం బహుతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అలపర్తి శ్రీనివాస రావు, సంగమేశ్వర శాస్త్రి, తిమ్మన శ్యాంసుందర్, నందిరాజు విజయ కుమార్, సుధీర్ కుమార్ రాంబాబు, హరిబాబు, షేక్ బాబావలి, షేక్ మస్తాన్ వలి పాల్గొన్నారు.

జగన్‌తోనే సామాజిక న్యాయం

పర్చూరు : పదవులు ఇవ్వడం, సామాజిక న్యాయాన్ని పాటించటం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే సాధ్యమవుతుందని వైసిపి నాయకులు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వైసిపి నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ బండారు ప్రభాకర్ మాట్లాడుతూ 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 14 బిసి,ఎస్‌సి,ఎస్‌టిలకు కేటాయించిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

'తాళ్లూరి'కి మాతృవియోగం

ప్రజాశక్తి బాపట్ల



రమాదేవి (ఫైల్)

బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కోశాధికారి తాళ్లూరి రామ కష్ణారావుకు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి తాళ్లూరి రమాదేవి (70) మంగళవారం మృతిచెందారు. రమాదేవి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యదర్శి మానం నాగేశ్వరరావు,బిఇసి ప్రిన్సిపల్ నజీర్, బాపట్ల టిడిపి బాధ్యులు వేగేశన నరేంద్రవర్మ, బాపట్ల తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ,పలు విద్యాసంస్థల ప్రతినిధులు రమాదేవి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

నామినేషన్‌కు తరలివెళ్లిన నాయకులు

ప్రజాశక్తి-వెలిగండ్ల

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు బుధవారం నామినేషన్లు వేశారు. ఈ కార్యక్రమంలో వెలిగండ్ల మండలానికి చెందిన వివిధ ప్రజాసంఘాల నాయకులు తరలి వెళ్లారు. సిఐటియు, యుటిఎఫ్, జెవివి సంఘాల నాయ కులు చిత్తూరులో జరిగిన నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి. బాబురెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ భారీర్యాలీ నిర్వహించారు.

చిన్నారికి ఎమ్మెల్యే ఆశీర్వాదం

ప్రజాశక్తి-యద్దనపూడి

మండల పరిధిలోని అనంతవరం గ్రామానికి చెందిన మండవ సురేంద్ర బాబు కుమార్తె మహాలక్ష్మి ఓణీల వేడుక బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొని చిన్నారి మహాలక్ష్మిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తారక, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి-పర్చూరు



మాట్లాడుతున్న ఎంపిపి

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న ందున కొత్త పనులు ప్రతిపాదించ లేమని సమస్యలపై చర్చించటానికే పరిమిత మవుతామని ఎంపిపి మేకా ఆనందకుమారి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం ఎంపిపి మేకా ఆనందకుమారి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. తొలుత ఇటీవల మృతిచెందిన జడ్‌పిటిసికొల్లా గంగాభవాని సంతాపం వ్యక్తం చేస్తూ తీర్మానించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ బ్రహ్మయ్య మాట్లాడుతూ వచ్చేది వేసవి కాలం కాబట్టి చెరువులు పూర్తి స్థాయిలో నింపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నీటి ఎద్దడి తలెత్తకుండా కార్యాచరణ రూపొందించు కోవాలన్నారు. ఈ కార్యమంలో ఎఒ. రామ్మోహన్‌రెడ్డి, విద్యుత్ ఎఇ రమేష్, తహశీల్దారు కె.నెహ్రూబాబు, ఎంపిటిసిలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లారీలు ఢీకొని డ్రైవర్ మృతి

ప్రజాశక్తి- శింగరాయకొండ



మృతిచెందిన లారీ డ్రైవర్

ఆగున్న లారీని మరో లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని కలికివాయ వద్ద జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... మిర్యాలగూడ నుంచి శింగరాయకొండ పెరల్ డిస్టలరీకి బియ్యంలోడ్‌తో వస్తున్న లారీని కలివాయ ఫ్లైఓవర్ బిడ్జిపైకి వచ్చే సరికి టైరు పంచర్ అయ్యింది. దీంతో డ్రైవర్ లారీని అక్కడే నిలుపుదల చేశారు. ఈ క్రమంలో రాజమండ్రి నుంచి రామేశ్వరానికి జనరేటర్ తీసుకెళ్తున్న లారీ జాతీయ రహదారిపై ఆగున్న బియ్యం లారీని ఢీకొట్టింది. దీంతోడ్రైవర్ కోనసీమ జిల్లా తాత పోడుగు చెందిన సిహెచ్.వీర్రాజు లారికే క్యాబిన్ ఇరుక్కుపోయాడు. రెండు లారీల మధ్య ఇరుక్కుపోవడంతో వీర్రాజును బయటికి తీసేందుకు హైవే, శింగరాయకొండ పోలీసులు తీవ్ర కసరత్తు చేశారు. చివరకూ క్రేన్ సహాయంతో లారీలను తొలగించి క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ వీర్రాజును బయటకు తీశాడు. ఆయన అప్పటికే మృతిచెందాడు. శింగరాయకొండ ఎస్ఐ ఫిరోజా ఫాతిమా ఘటనా స్థలాన్ని పరిశీలించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. వీర్రాజు మతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా స్వాధీనం

బాపట్ల రూరల్ : అక్రమంగా సారా తయారీ చేసినా, విక్రయించినా వారిపై చర్యలు తప్పవని బాపట్ల డిఎస్‌పి ఎ.శ్రీనివాసరావు హెచ్చరించారు. కర్లపాలెం, ఛందోలు, వెదుళ్లపల్లి గ్రామాల్లో బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, బాపట్ల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సిబ్బంది బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్ల మండలం చిన్న బేతపూడిలో 2 లీటర్ల నాటుసారా, ఆరు ప్లాస్టిక్ డ్రమ్ములు, 50 లీటర్ల బెల్లం ఊట, 10 కిలోల నల్లబెల్లం, రెండు కిలోల సూపర్ స్వాధీనం చేసుకున్నారు. పాత కేసుల్లో నిందితులైన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు డిఎస్‌పి శ్రీనివాసరావు తెలిపారు.

యువకుడు మృతి

బాపట్ల రూరల్: సైకిల్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని కొత్త కాలువ వద్ద జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో సుబ్రమణ్యం(45)అనే వ్యక్తి మృతిచెందాడు. మృతుడు బాపట్ల నుంచి చీరాలకు సైకిల్‌పై వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలలో తనిఖీ

కంభంరూరల్ : మండల పరిధిలోని రావిపాడు జడ్‌పి ఉన్నత పాఠశాలను అకడమిక్ మానిటరింగ్ బందం సభ్యులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రార్ధనా సమయం ప్రారంభం నుంచి పాఠశాల ముగింపు వరకు అన్ని అంశాలను పరిశీలించారు. విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల హాజరు, పార్యప్రణాళికలు,వార్షిక ప్రణాళికలు, సంస్థాగత ప్రణాళికలు, ఉపాధ్యాయుల దైనందినిలు, బోధనో పకరణాలను పరిశీలించారు. తరగతి వారీగా, సబ్జెక్ట్ వారీగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఉపాధ్యాయుల మాదిరి బోధనను పరిశీలించి కనిష్ట, గరిష్ట స్థాయిని అంచనా వేశారు. మూల్యాంకన పత్రాలపై తల్లిదండ్రుల సంతకాలు చేయించాలనీ, తద్వారా విద్యార్థి సామర్థ్యాలను తల్లిదండ్రులు అంచనా వేస్తారని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనాలను రుచిచూశారు. ఈ కార్యక్రమంలో విద్యా పర్యవేక్షక బందం సభ్యులు కె.వెంకటరమణయ్య , వై. వీరనారాయణ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాశయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముఖ గుర్తింపు హాజరు బాధ్యత డిడిఒలదే

ఇన్‌ఛార్జి కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

ప్రభుత్వ ఉద్యోగుల ఎపిఎఫ్ఆర్ఎస్ (ముఖ గుర్తింపు వ్యవస్థ) ఆధారిత హాజరు బాధ్యత డిడిఒలదేనని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు తెలిపారు. ఎపిఎఫ్ఆర్ఎస్ అమలు తీరుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సాధారణ పరిపాలన అధికారి ముత్యాలరాజు, సిఎఫ్ఎంఎస్ అధికారి సునీల్ రెడ్డి బుధవారం వర్చువల్ విధానంలో సమావేశం నిర్వహించారు. ప్రతి ఉద్యోగి ఎపిఎఫ్ఆర్ఎస్‌లో రిజిస్ట్రేషన్ అయ్యేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగులంతా తప్పనిసరిగా ఎపిఎఫ్ ఆర్ఎస్‌లో హాజరు వేసేలా డిడిఒలు బాధ్యత వహించాలన్నారు. జిపిఎస్ ఆధారంగా ఉద్యోగుల ఎఫ్ఆర్ఎస్ నమోదు ఉంటుందన్నారు. విధులలో ఉండే ఉద్యోగులు ఓడి కింద హాజరు వేస్తే జిపిఎస్ ఆధారంగా



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ శ్రీనివాసులు

సంబంధిత ఉద్యోగి హాజరును డిడిఒలు ధృవీకరించాల్సి ఉందన్నారు. గ్రామ పంచాయతీలలో కొంతమంది ఉద్యోగుల పేర్లు కనిపించడం లేదని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు ముత్యాలరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఎఫ్ఆర్ఎస్‌లో వారికి లొకేషన్ చూపడం లేదని, ఎదురవుతున్న వివిధ సాంకేతిక సమస్యలను వివరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎఫ్ఆర్ఎస్‌పై సమీక్షించారు. ఎపిఎఫ్ఆర్ఎస్. కింద బాపట్ల జిల్లాలో 4,501 మంది ప్రభుత్వ ఉద్యోగులు హాజరు వేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం 75 శాతం ఎపిఎఫ్ఆర్ఎస్ నమోదు జరిగిందన్నారు. మిగిలిన ఉద్యోగులంతా విధిగా తమ ఐడి నెంబర్లతో ఆన్‌లైన్ హాజరు విధానంలోకి రావాలన్నారు. క్యాంపులు వెళ్లే అధికారులు, ఆన్ డ్యూటీలో ఇతర ప్రాంతాలలో విధులు నిర్వహించే అధికారులు ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు వేయవచ్చన్నారు. ఇలాంటి వారి హాజరును జిపిఎస్ ఆధారంగా పరిశీలించిన తదుపరి డిడిఒలు ధృవీకరించాలని ఆయన సూచించారు. వ్యవసాయ శాఖలో 14 మంది ఉద్యోగులు ఇప్పటివరకూ ఎఫ్ఆర్ఎస్‌లో నమోదు కాకపోవడంపై ఆరాతీశారు. అలాంటి వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీశివజ్యోతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎఆర్ సిబ్బంది పాత్ర కీలకం : ఎస్‌పి

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

శాంతిభద్రతల పరిరక్షణలో ఎఆర్ సిబ్బంది పాత్ర కీలకమని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ పెరేడ్ గ్రౌండ్ లో జిల్లా సాయుధ పోలీసు బలగాలకు నిర్వహించిన డీ మొబ లైజేషన్ ముగింపు కార్యక్రమంలో ఎస్‌పి పాల్గొన్నారు. ప్రత్యేక వాహనంలో పోలీసు బలగాల ప్లటూన్లను ఎస్‌పి పరిశీలించారు. ప్లటూన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పెరేడ్ మరియు బ్యాండ్ ను చాలా చక్కగా ప్రదర్శించారని సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ బాపట్ల జిల్లా ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొట్ట మొదటి మొబలైజేషన్ కార్యక్రమమని తెలిపారు. జిల్లాలో పూర్తిస్థాయిలో



గౌవర వందనాన్ని స్వీకరిస్తున్న ఎస్‌పి

సాయుధ బలగాలు ఉన్నాయన్నారు. ఈనెల 6 నుంచి 22 వరకూ ప్రతి ప్లటున్ లో 40 మంది చొప్పున 8 ప్లటున్ లతో మొగలైజేషన్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భ:గా పెరేడ్ కమాండర్ ఆర్ఐ ఎల్.మన్మధ రావును ఎస్‌పి అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి పి.మహేష్ , ఎఆర్ డిఎస్‌పి ప్రేమ్ కుమార్, బాపట్ల డిఎస్‌పి ఎ.శ్రీనివాస రావు , డిఎస్‌బి ఇన్‌స్పెక్టర్ ఎ. శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ బి. శ్రీకాంత్ నాయక్ , బాపట్ల టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.కష్ణయ్య పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేయాలి : ఎంపిపి

ప్రజాశక్తి - నిజాంపట్నం

అధికారులు అంకితభావంతో పని చేయాలని ఎంపిపి మోపిదేవి విజయనిర్మల వెంకట హరినాథ్ బాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ నర్రా నాగలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి రాబోవు కాలం వేసవిలో మండల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు అంకితభావంతో పనిచేయాలని తెలిపారు. వేసవికాలం దష్ట్యా తీర ప్రాంత గ్రామాల్లో తాగునీటి, విద్యుత్, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించారు. ఎంపిటిసిలు, సర్పంచులు మాట్లాడుతూ తమ గ్రామాల్లో విద్యుత్, డ్రైనేజీ సమస్యల వల్ల వర్షాకాలంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి వేసవి కాలంలోనే ఈ సమస్యలను పరిష్కరిస్తే వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు ఉండని



మాట్లాడుతున్న ఎంపిపి మోపిదేవి విజయనిర్మల

తెలిపారు. జడ్‌పిటిసి నర్రా సుబ్బయ్య మాట్లాడుతూ ప్రజలు తాగునీటి సమస్యలతో ఇబ్బందులకు గురికాకుండా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తీరప్రాంత మండలం అయినందున పంచాయతీ సమస్యలు ఉన్న గ్రామాలను గుర్తించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు ఇక్బాల్ ,ఎంఇఒ హరిబాబు, ఎంపిటిసి నాజర్ ఖాన్, వైస్‌ఎంపిపిలు సుబ్బారావు, చంటి, ఎంపిటిసిలు, సర్పంచులు ,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిస్వార్థ ప్రజా సేవకుడు తవనం చెంచయ్య

సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య

ప్రజాశక్తి- చీరాల

ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసి నిస్వార్థ ప్రజా సేవకుడిగా తవనం చెంచయ్య పేరు తెచ్చుకున్నారని సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య తెలిపారు. తవనం చెంచయ్య 9వ వర్ధంతి సిపిఎం బాపట్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చీరాల సిఐటియు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ తవనం



తవనం చెంచయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చెంచయ్య నిరుపేద కుటుంబంలో జన్మించి వ్యవసాయ కార్మికులు, దళితుల సమస్యలు, ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై నిరంతరం కృషి చేసినట్లు తెలిపారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు ఎలాంటి ఆర్భాటాలు లేకుండా నిస్వార్థ ప్రజా సేవకుడిగా ప్రజలకు సేవ చేసారని తెలిపారు. అలాంటి నాయకులు ఈ రోజుల్లో కరువయ్యారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అనేకమంది పేదలకు భూములు పై హక్కులు కల్పించడం కోసం చెంచయ్య భూ పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. దళితుల ఎదుర్కొన్న సామాజిక సమస్యలపై, కుల వివక్ష సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. చెంచయ్య స్ఫూర్తితో పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం ,సమ సమాజ నిర్మాణం కోసం కషి చేయాలని కోరారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేసి ఐక్య పోరాట నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణమోహన్, ఎన్.బాబూరావు, చీరాల నాయకులు ఎం. వసంతరావు,పి.కొండయ్య, కె.శరత్ బాబు, పి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు. **మేదరమెట్ల :** కొరిశపాడు మండలం ప్రాసంగులపాడులోని సిపిఎం కార్యాలయంలో కామ్రేడ్ తవనం చెంచయ్య 9వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సభలో వక్తలు మాట్లాడుతూ పేదల పక్ష పాతిగా, దళితుల అభివద్ధిని కాంక్షించే వ్యక్తిగా కామ్రేడ్ చెంచయ్య నిలిచినట్లు తెలిపారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసే మచ్చలేని నాయకునిగా, తిరుగులేని నాయకునిగా ఉన్నారని తెలిపారు. ఇలాంటి వ్యక్తులు నేటి సమాజంలో అరుదుగా కనిపిస్తారని తెలిపారు. చెంచయ్య పార్టీకి ఎనలేని సేవ చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల అధ్యక్షుడు ఎం.ఆంజనేయులు, మండల కమిటీ సభ్యులు, సిఐటియు బాధ్యులు కెఎ.రాజు, చావా కోటేశ్వరరావు, కంచర్ల సుధాకర్ , నందికోలు సుబ్బారావు, కంచర్ల సురేష్ పాల్గొన్నారు.

మద్దిపాడు : కామ్రేడ్ తవనం చెంచయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి మాట్లాడుతూఅంటరాని తనానికి వ్యతిరేకంగా చెంచయ్య పోరాటం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా భూపోరాటాలు, కూలి పెంపు పోరాటాలు చేసారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉబ్బా వెంకటేశ్వర్లు, కె.వెంకటేశ్వర్లు, బొమ్మలనాగేశ్వరావు, కాకుమాను అంజయ్య, జజ్జర ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

మౌలానా ఆజాద్‌కు నివాళి

ప్రజాశక్తి- బాపట్ల

భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అజాద్ వర్ధంతి స్థానిక అంజుమన్ కమిటీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది జడ్. బాషా , కాంగ్రెస్‌పార్టీ నాయకులు అంజి బాబు, కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడు పఠాన్ రాజేష్, నాయకులు నక్కల రాంబాబు, తాజుద్దీన్, గడ్డం ఇస్సాకు, కట్టా లాజర్, శీలం సాగర్, బక్క రోశయ్య, అమీర్ బాషా, పీరా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

25న క్యాంపస్ సెలక్షన్స్

ప్రజాశక్తి-వేటపాలెం

స్థానిక సెయింట్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో హెటిరో డ్రగ్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఈనెల 25న క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకష్ణారావు, కళాశాల కరస్పాండెంట్ ఎస్. లక్ష్మణరావు ఓ ప్రకటనలో తెలిపారు. 2023 విద్యా సంవత్సరంలో బి. ఫార్మసీ మరియు ఎం. ఫార్మసీ పూర్తి చేసే విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్స నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ల ప్రిన్సిపాల్ గారు తెలిపారు.ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ ఎంపికలకు హాజరు కావచ్చునని కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎన్. పూర్ణచంద్రరావు తెలిపారు.

26లోపు ఇకెవైసి చేయించుకోవాలి

బాపట్ల జిల్లా : జిల్లాలోని రైతులు రబీ సీజన్‌లో 3.22 లక్షల ఎకరాలలో వివిధ పంటలు సాగు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్ తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు 3.11 లక్షల ఎకరాలకు ఈ క్రాప్ నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ క్రాప్ నమోదు చేయించుకున్న రైతులు తప్పని సరిగా ఈనెల 26లోపు ఇకెవైసి చేయించుకోలన్నారు. తమ గ్రామ పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో ఇకెవైసి చేయించుకోవాలన్నారు. సంక్షేమ పథకాల లబ్ధి పొందాలన్నా, పంట నష్ట పరిహారం, పంటల బీమా పథకం ,సున్నా వడ్డీ పంట రుణాలు పొందాలంటే తప్పని సరిగా ఇకెవైసి చేసుకోవాలన్నారు.

‘ఉయ్యాలవాడ’కు నివాళి

బాపట్ల : స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడి బ్రిటిష్ వారిని గడగడలాడించిన వారిలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రముఖులని బాపట్ల వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డిడి. స్మిత్ తెలిపారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్మిత్ మాట్లాడుతూ ఆంగ్లేయులు విధించిన శిక్షకు సైతం భయపడకుండా ఉరికంభం ఎక్కారన్నారు. సాహసంతోపేతమైన ఉద్యమాలు చేపట్టి దేశానికి స్వాతంత్ర్యం కోసం పోరాడారన్నారు. నేటి యువత , విద్యార్థులు ఉయ్యాలవాడను ఆదర్శంగా తీసుకుని మంచి బాటలో పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి .హరిబాబు , కెవిఎస్.రామిరెడ్డి , రవిబాబు, బి.శ్రీనివాసుల రెడ్డి, లావణ్య ,కవిత, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

పంగులూరు : ఉగాది నాటికి జగనన్న లేఅవుట్లు, సొంత స్థలాల్లో నిర్మిస్తున్న గృహ నిర్మాణాలను శాతం పూర్తి చేయాలని ఎంపిడిఒ రమణమూర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై వెలుగు, హౌసింగ్ అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం చేపడుతున్న ప్రతి లబ్ధిదారునికి విఒఒలు, సిసిలు బ్యాంకు ద్వారా, గ్రూపుల ద్వారా రూ.35వేల రుణం తప్పనిసరిగా ఇప్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ జెఇ కిషోర్, ఎపిఎం జ్యోతి ప్రసాద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అనంతలక్ష్మి,సిసిలు కామేశ్వరరావు, దాసు, నరసింహారావు పాల్గొన్నారు.

పంట కాలువ ఆక్రమణ

బాపట్ల రూరల్ : మండల పరిధిలోని మూలపాలెం వెళ్లే రహదారిలో వ్యవసాయ మురుగు కాలువ కట్ట కొందరు ఆక్రమించారు. కాలువ కట్ట ఆక్రమించి దానిపై షాపులు నిర్మించారు. కొందరుకాలువ గట్టుపై నిర్మాణాలు చేపట్టగా మరికొందరు కాలువలు పూడ్చి అమ్ముకొనేందుకు ప్రయత్నిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందిచి ఆక్రమణలను తొలగించి ప్రజలు కోరుతున్నారు.

వెలవెలబోయిన మండల సమావేశం

సమయపాలన, క్రమశిక్షణ పాటించని సభ్యులు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధ వారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వెలవెలబోయింది. సమావేశానికి ఎంపిపి మోరబోయిన మురళీ క్రిష్ణ అధ్యక్షత వహించారు. నీటి సమస్య, విద్యుత్, ఉద్యానవన శాఖలపై గత సమావేశంలో ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్ళిన సమస్యల పరిష్కారంపై అడుగుదామనుకుంటే ఆ శాఖల అధికారులు డుమ్మా కొట్టడంతో ఎవరిని అడగాలని శిద్దవరం ఎంపిటిసి మీరావలి, వద్ది మడుగు, గనివెనపాడు స్పంచులు పిచ్చయ్య, లక్ష్మీవెంకటేశ్వర్లు అధికారులను నిలదీశారు. ఎంపిపి మోరబోయిన మురళీక్రిష్ణ, జడ్పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు మాట్లాడుతూ అధికారులు, సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలన్నారు. గత సమావేశాలకు గైర్హాజరైన అధికారులకు మెమోలు ఎందుకు జారీ చేయలేదని ఎంపిడిఒ రావూరి జనార్దన్‌ను నిలదీశారు. వద్దిమడుగు సర్పంచి పిచ్చయ్య, కొనకనమిట్ల ఎంపిటిసి కల్లం సుబ్బమ్మలు మాట్లాడుతూ మొక్కలు ఉండి వాటిని సంరక్షించే వారికి బిల్లులు ఎందుకు పెట్టరని ఎంపిడిఒ శ్రీనివాసులరెడ్డిని ప్రశ్నించారు. కొనకనమిట్ల ఫీల్డ్‌అసిస్టెంట్ ఏకపక్షంగా వ్యవహిస్తున్నారని ఎంపిడిఒ దృష్టికి తెచ్చారు. ఎంపిడిఒ రావూరి జనార్దన్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు పని తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవన్నారు. సమావేశాలకు రాని అధికారులకు మెమోలు జారీ చేయడం జరుగుతుదన్నారు. సమావేశం జరుగుతుండగానే సభ్యులు బయటకు వెళ్ళిపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. కార్యక్రమంలో తహశీల్దార్ కెవిఆర్.ప్రసాదరావు, ఎంపిడిఒ రావూరి జనార్దన్, జడ్పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, ఎంఇఒ షేక్.ఘంగేషరీఫ్, వ్యవసాయశాఖ అధికారి లక్ష్మీప్రసన్న, ఎపిఎం కె.గోపాల క్రిష్టారెడ్డి, ఎపిఒ శ్రీనివాసులరెడ్డి, మండల ఉపాధ్యక్షులు జనీఫా, హౌసింగ్ ఎఇ బాలు నాయక్, సింగిలివిండో అధ్యక్షులు కామసాని వెంకటేశ్వర్లరెడ్డి, కాశిరెడ్డి, వైద్యాధికారి సురేఖ, పృథ్వీరాజ్, ఎఇ నిరంజన్, ఫారెస్ట్ బీట్ అధికారి ఎస్.నాగరాజారావు, అంగన్‌వాడి సూపర్‌వైజర్ సుబాషిణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి మురళీక్రిష్ణ

జిల్లావ్యాప్తంగా

విద్యుత్ బకాయిలు రూ.525 కోట్లు..

- జిల్లాకు నూతనంగా 18 సబ్ స్టేషన్లు మంజూరు
- 48 జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ పనులు పూర్తి
- విద్యుత్ శాఖ ఎస్ఇ కేవీ.సత్యనారాయణ

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

జిల్లావ్యాప్తంగా రూ.525 కోట్ల మేర విద్యుత్ బకాయిలు ఉన్నట్లు ఏపీ సిపిడిసిఎల్ జిల్లా ఎస్ఇ కెవి.సత్యనారాయణ తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక డిఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఈ సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్డబ్ల్యూఎస్ పంచాయతీరాజ్ ఇరిగేషన్ శాఖలు బకాయిలు దాదాపు 300 కోట్ల రూపాయలు ఉన్నాయన్నారు. మార్చి నెల లోపు పేరుకుపోయిన బకాయిలు చెల్లించవలసినదిగా ఆయా శాఖల అధిపతులకు లేఖలు పంపించడం జరిగిందన్నారు. కాగా జిల్లావ్యాప్తంగా మొత్తం 220 జగనన్న లేఔట్లు ఉండగా అందులో 480 లేఔట్లకు సంబంధించిన విద్యుదీకరణ పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు దాదాపు రెండు వేల గృహాలకు విద్యుదీకరణ పూర్తి చేశామన్నారు. జగనన్న కాలనీలో లబ్ధిదారులకు ప్రభుత్వమే ఉచితంగా సర్వీస్ వైరు కరెంటు మీటర్లు ఇస్తున్నారని, ఇల్లు కట్టుకున్న వారికి 48 గంటల్లో విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులకు అవసరమైన మూడువేల ట్రాన్స్ఫార్మర్లు తెప్పించామని, వెంటనే ఆయా రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో అధికారులు పివి నాగేశ్వరరావు, సియా నాయక్, సుబ్బారాయుడు, యశోదా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఇ సత్యనారాయణ



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

ఉత్సాహంగా 'శ్రీసాయిరామ్' వార్షికోత్సవం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

శ్రీ సాయిరామ్ బాలికల జూనియర్ కళాశాల ఏడో వార్షికోత్సవ వేడుకలు బుధ వారం ఉత్సాహంగా జరిగాయి. వేడుకలకు కరస్పాండెంట్ కొప్పర్తి మోహన్‌రావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఏఆర్ ఎఎస్‌పి అశోక్‌బాబు మాట్లాడుతూ సమాజంలో పోటీ తత్వాన్ని గుర్తెరిగి అన్ని రంగాలలో ఉన్నతంగా ఎదిగి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా ఆలోచన అలవర్చుకోవాలని విద్యార్థినులకు దిశా నిర్దేశం చేశారు. ట్రాఫిక్ డిఎస్‌పి విక్రమ్ శ్రీనివాస్, ఇంటర్మీడియట్ కళాశాలల ఆర్‌జెడి వివి సుబ్బారావు, ఆర్ఐఒ ఏ.సైమన్ విక్టర్ విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.అంజయ్య వార్షిక నివేదికను ప్రవేశపెట్టి.. మాట్లాడారు. పెద్దలు, తల్లిదండ్రుల మాటలు గౌరవించి కష్టపడి చదివితే విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలు చేరుకోవచ్చన్నారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చైర్మన్ వెంకటనారాయణ, కె.శ్రీనివాసరావు, నవీన్, సాయి కృష్ణ, బ్రహ్మం, ఫణి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



నల్లమలలో పర్యటిస్తున్న శాంతి ప్రియపాండే

అడవులను కాపాడటం మనందరి బాధ్యత

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

అడవులను కాపాడటం మనందరి బాధ్యత అని అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శాంతిప్రియ పాండే తెలిపారు. బుధవారం ఆమె అటవీ శాఖ అధికారులు, సిబ్బందితో కలిసి దోర్నాల అటవీ శాఖ పరిధిలోని కొర్రపోలు, పులిచెరువు, జంగిల్ సఫారి తదితర ప్రాంతాలను సందర్శించారు. నల్లమల లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడవులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా మార్కాపురం ఫీల్డ్ డైరెక్టర్ విఘ్నేష్ అపావుత్ మాట్లాడారు. నల్లమల అటవీ ప్రాముఖ్యత, పులులు, వాటి రక్షణ, ఆర్వోఎఫ్ ఆర్ పట్టాలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట దోర్నాల ఎఫ్ ఆర్వో విశ్వేశ్వరరావు ఉన్నారు.

జగన్ పాలనలో ప్రజలపై ఆర్థిక భారాలు

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జగన్ పాలనలో ప్రజలపై ఆర్థిక భారాలు తప్ప సంక్షేమం లేదని టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. బుధవారం టిడిపి ఆధ్వర్యంలో వెంకటాద్రిపాలెం గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి మూడున్నరేళ్ల వైసీపీ పాలనలో సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని.. వాటిని నమోదు చేసుకున్నారు. అనంతరం ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి మొదటి రోజు నుండి ఈ రోజు వరకు ప్రజలపై ఆర్థిక భారం మోపటం తప్ప, ఒక్క సంక్షేమం కూడా అందించలేదన్నారు. నిత్యావసర ధరలు, వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్, బస్సు చార్జీలను పెంచి పేదలపై భారం మోపారన్నారు. ప్రజా వేదిక కూల్చటం మొదలుకొని బీసీ, ఎస్సి, ఎస్టీ, మైనార్టీలపై దాడులు చేయటం, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టటం జగన్ ప్రభుత్వానికి అలవాటు అయ్యిందన్నారు. నాడు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బీసీ, ఎస్సి, ఎస్టీ, మైనార్టీల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి పేదల సంక్షేమానికి కృషి చేయటం జరిగిందని తెలిపారు. ఐతే అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు మాత్రం ప్రజా సంక్షేమ పథకాలకు తూట్లు పొడిచి ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న జగన్ రెడ్డి ప్రభుత్వానికి రాష్ట్రాన్ని పాలించే అర్హత లేదని, ప్రజా క్షేత్రంలో వైసీపీ ప్రభుత్వానికి నూకలు చెల్లాయన్నారు. రాబోయే ఎన్నికల్లో యర్రగొండపాలెం నుండి మీ మద్దతు తెలియచేయాలని, మీ దీవెనలతో మన యర్రగొండపాలెం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమే అని, ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి నారా చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాద్రిపాలెం సర్పంచ్ బోడా శ్రీశైలపతి నాయుడు, టిడిపి నాయకులు షేక్ మస్తాన్‌వలి, మంత్రునాయక్, సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.



'ఇదేం ఖర్మ' కార్యక్రమంలో టిడిపి నాయకులు

పన్నుల వసూళ్లలో పురోగతి ఏదీ.?

సచివాలయ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులిచ్చిన కమిషనర్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలో ప్రజల నుంచి ఆస్తి పన్ను, నీటి పన్ను వసూళ్ల లక్ష్యాలను చేరుకోవడంలో సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్దేశించిన పన్నులు వసూళ్లలో ఎందుకు వెనుకబడుతున్నారో చెప్పాలంటూ నగరంలోని 70 సచివాలయాల పరిపాలనా కార్యదర్శులు, నగరపాలక సంస్థ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లకు మూడు రోజుల కిందట షోకాజ్ నోటీసులు జారీచేశారు. నోటీసులు అందుకున్న మూడు రోజులలోపు వారి సంజాయిషీ లిఖిత పూర్వకంగా తెలియజేయాలని, పని తీరు మెరుగుపరుచుకోకపోతే చట్టప్రకారం చర్యలు తప్పవని ఆ నోటీసులో హెచ్చరించారు. వంద శాతం పన్నులు వసూళ్లకు శ్రద్ధ కనబరచాలని సూచించారు.

బహుమతులు అందజేత

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర వ్యాప్తంగా 'మానవత-నైతికత' అనే నినాదంతో జాగరణ ఉద్యమాన్ని ఈ నెల 11 నుండి 20 వరకు చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సాయంత్రం స్థానిక మార్కాపురం ప్రెస్ క్లబ్‌లో చిత్ర లేఖనం మరియు వ్యాసరచన పోటీల్లో విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిప్యూటీ డిఎంహెచ్ఓ రాహుల్ మాట్లాడుతూ మనిషి తోటి వారి పట్ల దయ, జాలి, కరుణ, సానుభూతి కలిగి ఉంటూ కులమతాలకు అతీతంగా మనుషులందరినీ ప్రేమించాలన్నారు. కార్యక్రమంలో పంచాయితీ రాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ విజిలెన్స్ అధికారి మహబూబ్ బాషా, నార్ల వెంకటేశ్వర్లు, జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర సలహా మండలి సభ్యులు అష్రఫ్ అలీ పాల్గొన్నారు.

సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఎస్ఐ సంపత్‌కుమార్

ప్రజాశక్తి-ముండ్లమూరు

గ్రామాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్ఐ సంపత్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గ్రామ సర్పంచ్‌లకు సిసి కెమెరాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇటీవల గ్రామాల్లో దొంగతనాలు ఎక్కువయ్యాయని, అందువల్ల ప్రతి గ్రామ పంచాయతీలో సిసి కెమెరాలు ఏర్పాటుచేస్తే దొంగలను పట్టుకోవడం సులభం అవుతుందన్నారు. మండలంలోని 21 గ్రామ పంచాయితీలోని 45 గ్రామాల కూడలిలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి పోలీసు వారికి సహకరించాలన్నారు. మండలంలోని ఆటో యజమానులకు ఆటోలకు స్టిక్కర్లను అంటించారు. ఆటో నంబర్ కోడ్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వల్ల ఆటోలు ప్రమాదాలకు గురైనప్పుడు వెంటనే కనుక్కోవడానికి ఈ నంబర్లు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఆటోల యజమానులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ చిత్రపటాలు బహూకరణ

ప్రజాశక్తి-కొనకనమిట్ల

స్థానిక ఎంపిడిఓ, ఎంఇఒ, జడ్పిటిసిల కార్యాలయాలకు ఉపాధ్యాయులు నారాయణ బుధవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటాలను బహూకరించారు. ఎంపిపి మోరబోయిన మురళీక్రిష్ణ, జడ్పిటిసి అక్కదాసరి ఏడుకొండలు, ఎంపిడిఒ రావూరి జనార్దన్, శిద్దవరం, వద్దిమడుగు, ఇరసలగుండం ఎంపిటిసిలు షేక్.మీరావలి, చక్కెర వెలుగొండయ్య, కరేటి రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక అంశాలపై అవగాహన అవసరం

'పేస్'లో క్లౌడ్ టెక్నాలజీపై వర్క్ షాప్

ప్రజాశక్తి-టంగుటూరు



మాట్లాడుతున్న శ్రీధర్

క్లౌడ్ టెక్నాలజీకి సంబంధించిన సర్టిఫికేషన్, ఉద్యోగ మరియు ఎంటర్ ప్రెన్యూర్ కు సంబంధించిన సాంకేతిక అంశాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని ఎడ్యు స్కిల్స్ ఏడి వివేక్‌రంజన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్లేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎడ్యు స్కిల్స్ మరియు ఎడబ్ల్యూఎస్ వారి సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు టెక్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లౌడ్ టెక్నాలజీని వివిధ రంగాలలో ఏ విధంగా వినియోగిస్తారో విద్యార్థినులకు ఆయన ప్రయోగాత్మకంగా వివరించారు. కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు నైపుణ్యం కలిగిన శిక్షకుల సమక్షంలో ఏడబ్ల్యూఎస్ సర్టిఫికేషన్ పూర్తి చేయడానికి అవసరమైన గైడెన్స్‌ను పేస్ విద్యార్థినులకు అందిస్తున్న శిక్షకులకు ఆయన కతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులు దీప్తి చీమకుర్తి, ఎడబ్ల్యూఎస్ ప్రోగ్రామ్ సీనియర్ మేనేజర్ అభీర్ నాయక్, కళాశాల ప్రిన్సిపాల్ జివికే మూర్తి, ప్లేస్ మెంట్స్ డీన్ కె రూప, ఉమెన్ ఎంపవర్ మెంట్ కోఆర్డినేటర్ వైష్ణవి, ఎడ్యు స్కిల్స్ కోఆర్డినేటర్ కె రాజ్‌కిరణ్ పాల్గొన్నారు.

సైన్స్ ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-సిఎస్‌పురం



ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రకాశం జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శనలో అరివేముల హైస్కూలు విద్యార్థులు యశ్వంత్, తేజ మండలం తరపున పాల్గొని మంచి ప్రతిభ కనబర్చారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. కవితా ప్రియ తెలిపారు. ఒంగోలులో జరిగిన జిల్లా స్థాయి ప్రదర్శన లో వీరు పవన విద్యుత్ గురించి తెలిపే ప్రాజెక్టును సైన్స్ ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు షేక్ నయుమ్ అభినందించారు.

ట్రైన్‌పై రాళ్లు విసరడం నేరం..

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

వేగంగా కదులుతున్న రైలు బండిపై రాళ్లు విసరడం చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని రైల్వే హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఇటీవల కాలంలో రైల్వే ఆస్తులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు రైల్వే పోలీసుల ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. బుధవారం మండల పరిధిలోని రాయవరం లో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ చారి పాల్గొన్నారు.

పులిని చంపి తిన్నారన్న వార్త అవాస్తవం

రాష్ట్ర అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పులిని చంపి తిన్నట్లు వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, అవి కేవలం వదంతులేనని రాష్ట్ర అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన అటవీ శాఖాధికారులతో కలిసి పుల్లలచెరువు మండలంలోని అక్కపాలెం గిరిజన గూడెం సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతం పరిధిలో గల అనుమానిత ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన అక్కపాలెం సమీపంలోని ఈతలకొండ, ఎర్రదరి ప్రాంతాల్లో పులి సంచరిస్తుందని వచ్చిన సమాచారం మేరకు ఆయా ప్రాంతాల్లో పులి అడుగు జాడలను గుర్తించడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అయితే పులిని చంపారని, దాని మాంసం వండుకుని తిన్నారని తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. అయినప్పటికీ తమ సిబ్బంది అక్కపాలెం గిరిజన వాసులను విచారించడంతో పాటు అనుమానిత ప్రాంతంలో గాలించినప్పటికీ పులి చనిపోయినట్లు ఎటువంటి ఆనవాళ్లూ దొరకలేదని తెలిపారు. అక్కపాలెం బీట్ పరిధిలో పులి



వివరాలు తెలుసుకుంటున్న శ్రీనివాసరెడ్డి

క్షేమంగా అటవీ ప్రాంతంలో సంచరిస్తోందన్నారు. ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు అడవుల్లోకి వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆయన వెంట మార్కాపురం ఫీల్డ్ డైరెక్టర్ విఘ్నేష్ అపావు, యర్రగొండపాలెం ఎఫ్ఆర్వో నీలకంఠేశ్వరరెడ్డి, పుల్లలచెరువు డిఆర్వో రాంమోహన్‌రావు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అడవులను కాపాడటం అందరి బాధ్యత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అడవులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని యర్రగొండపాలెం డిప్యూటి ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం యర్రగొండపాలెంలోని నలందయున్నత పాఠశాల విద్యార్థులతో దోర్నాల సమీపంలోని జంగిల్ సఫారీని సందర్శించారు. విద్యార్థులకు జంగిల్ సఫారి ద్వారా అక్కడ ఉండే సౌకర్యాలను, చూడదగ్గ ప్రదేశాలను, అటవీ జంతువులను ప్రత్యక్షంగా చూపించి.. వాటి పట్ల అవగాహన కల్పించారు. విద్యార్థులతో వన్య ప్రాణుల ప్రాముఖ్యత గురించి నేచర్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ సిబ్బంది అటవీ పరిసరాలు, వాటి సంరక్షణ, అక్కడి జీవ వైవిధ్యం, అడవుల వల్ల కలిగే ఉపయోగాలు, మానవాళికి



నల్లమలలో విద్యార్థులు

ఉపయోగాలు వంటి ఎన్నో అంశాలపై అటవీ అధికారులు ప్రత్యక్ష అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిస్వార్థ రాజకీయ జీవితానికి

నిలువెత్తు నిదర్శనం 'తవనం'

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

నిస్వార్థ రాజకీయ జీవితానికి నిలువెత్తు నిదర్శనం సిపిఎం సీనియర్ నాయకులు తవనం చెంచయ్య అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డీకేఎం రఫీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ తవనం చెంచయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి.. ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు షేక్ నన్నెసా, పి.రూబెన్, జవ్వాజి రాజు, లోకేష్, విక్టర్, జోనా, కార్తీక్, కె.సుబ్బరాయుడు పాల్గొన్నారు.

టంగుటూరు: నీతి, నిజాయితీలతో తన జీవితాన్ని ప్రజలకోసం అంకితం చేసిన ధన్యజీవి తవనం చెంచయ్య అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గంటెనపల్లి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం టంగుటూరులో మాజీ ఎమ్మెల్యే తవనం చెంచయ్య వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ వేశపోగు మోజెస్, సిపిఎం నాయకులు మల్లాల యానాది, కొల్లాబత్తిన శ్రీనివాసులు, శ్రీను, సి.మాధవ తదితరులు పాల్గొన్నారు.



తవనం చెంచయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సిఎస్.పురం: మాజీ ఎమ్మెల్యే తవనం చెంచయ్య వర్ధంతి సందర్భంగా సిఎస్.పురం నారాయణస్వామి కాంప్లెక్స్‌లో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఊసా వెంకటేశ్వర్లు, ఎస్.తిరుపతిరెడ్డి, ఆర్.కరిముల్లా, యు.రాజ్యలక్ష్మి, బి.దేవదానం, విజయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తంగిరాల రాజు

జగన్‌పై బురద చల్లుతున్నారు: వైసిపి

ప్రజాశక్తి-త్రిపురాంతకం

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరడం ఇష్టం లేని తెలుగుదేశం నాయకులు తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డిపై బురద చల్లుతున్నారని వైసిపి ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు తంగిరాల రాజు ఆరోపించారు. త్రిపురాంతకం మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం నాయకులు చేసిన వ్యాఖ్యలతో ఎటువంటి నిజం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎవరు ఎవరికి బుద్ధి చెప్పేది త్వరలోనే తెలుస్తుందన్నారు. గన్నవరంలో జరిగిన ఘటనకు, వైసిపికి ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు కోటి, బీసీ సెల్ నాయకులు పోటు అచ్చయ్య, వైసిపి నాయకులు ప్రసన్నకుమార్, హరినాథ్, రాజు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

దోర్నాల నుండి హైదరాబాదుకు మార్కాపురం డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సును బుధవారం రాత్రి 9 గంటల నుంచి ప్రారంభించనున్నారు. ప్రతిరోజు రాత్రి 9 గంటలకు దోర్నాల నుంచి హైదరాబాదుకు ఆర్టీసీ బస్సు బయలుదేరనున్నట్లు మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ నరసింహులు తెలిపారు. హైదరాబాదు వెళ్లే ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోగలరని తెలిపారు. ప్రతిరోజూ రాత్రి 9 గంటలకు బస్సు బయలుదేరే ముందు వరకు ఆన్‌లైన్‌లో టికెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదేశాల మేరకు దోర్నాల మండల ప్రజలకు సౌకర్యార్థం బస్సును నడుపుతున్నట్లు పేర్కొన్నారు.

24న ఎంపీ మాగుంట పర్యటన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈ నెల 24న పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం 8 గంటలకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. 11 గంటలకు ఒంగోలులో స్థానికంగా జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం 4 గంటలకు ఒంగోలులోనే స్థానికంగా జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు. సాయంత్రం 5 గంటలకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు.



సమావేశంలో పాల్గొన్న కిరణ్‌కుమార్

పిల్లలందరినీ బడిలో చేర్పిద్దాం

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని జిల్లా ఎస్‌బిసిసి కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం హనుమంతునిపాడు మండలంలో పర్యటనలో భాగంగా హనుమంతునిపాడు మండల విద్యా వనరుల కేంద్రంలో మండల విద్యాధికారి పెద్దిరాజు అధ్యక్షతన సి.ఆర్.పిలకు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో బాలకార్మికులను మరియు వెట్టిచాకిరిలో ఉన్న బాలలను గుర్తించి వారికి పునరావాసం కల్పించడానికి కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఎంఇఒ పెద్దిరాజు తెలిపారు. అనంతరం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సచివాలయ ఏఎన్ఎంలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి ఎస్బిసిసి సెల్ జిల్లా కమిటీ సభ్యులు గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

వైసీపీ దుర్మార్గాలను ప్రజలకు తెలియజేయాలి: ముత్తుముల

ప్రజాశక్తి-గిద్దలూరు

వైసీపీ దుర్మార్గాలను ప్రజలకు తెలియజేయాలని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. పట్టణంలోని స్థానిక టీడీపీ కార్యా లయంలో టీడీపీ అధ్యక్షులు సయ్యద్ శానేషావలీ అధ్యక్షతన పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌రెడ్డి పాలనలో రోజుకొక దాడి, పూటకొక దౌర్జన్యం చేస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు చట్టాన్ని చేతిలోకి తీసుకున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేందుకు భౌతిక దాడులకు తెగబడుతున్నారన్నారు.



'ఇదేం కర్మ' కార్యక్రమంలో ముత్తుముల అశోక్‌రెడ్డి

వైసీపీ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలను ప్రజలకు వివరించాలన్నారు. పట్టణంలోని గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అన్యాయాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్లు బూనే బోయిన చంద్ర శేఖర్ యాదవ్, బిల్లా రమేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు మండ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

కంభం రూరల్: వైసిపి పాలనలో మహిళలకు భద్రత లేదు..యువతకు ఉపాధి లేదని మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆరోపించారు. కంభం పట్టణంలో బుధవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిలిచిన రోడ్డు నిర్మాణం..

- రాకపోకలకు అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

అద్దేపల్లిలో గత మూడేళ్లగా నిలిచిపోయిన ప్రధాన రహదారి నిర్మాణానికి ఇటీవల అడుగులు ముందుకు పడ్డాయి. సుమారు రూ.10 లక్షల వ్యయంతో ఈ రహదారి పనులు చేపట్టారు. దీంతో అద్దేపల్లి దళితవాడ వాసులు సంబర పడ్డారు. ఈ సంబరం కొన్ని రోజులకే కనుమరుగయ్యింది. రోడ్డు నిర్మాణం మొత్తం పూర్తి కాలేదు. అర్ధాంతరంగా 20 మీటర్ల మేర రోడ్డు పనులు నిలిచిపోయాయి.పనులు చేపట్టిన అధికార పార్టీ నాయకుడు వివక్షను ప్రదర్శిస్తూ దళితవాడలో కొందరికి అనుకూలంగా, మరికొందరికి వ్యతిరేకంగా రహదారిని సర్వే చేయించారు. దీంతో మాజీ సర్పంచి నివాస గహం రోడ్డు ఆక్రమణలో ఉన్నట్లు సర్వేలో తేలింది. సర్వే ప్రకారం కాకుండా పాత రహదారిలోనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని మాజీ సర్పంచి కుటుంబ సభ్యులు పట్టుపట్టారు. దీంతో కొన్ని రోజుల పాటు రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో మంత్రి నాగార్జున ఓ మతురాలి కుటుంబ సభ్యులను పరా మర్శించేందుకు గ్రామానికి వచ్చారు. ఆ సమయంలో మాజీ సర్పంచి మరియమ్మ తాను రహదారి నిర్మాణం పనులు అడ్డుకున్నట్లుగా ఆరోపిస్తున్నారని, అలాంటిదేమి లేదని రహదారికి అవసరమైన మేర స్థలాన్ని సేకరించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరింది. అయినప్పటికీ గుతేదారుడు నిలిచిన రోడ్డును పూర్తిచేయ్యకుండా అవసరం లేని వెల్లటూరు ఛానల్ వంతెన సమీపంలో రోడ్డును నిర్మించాడు. అవసరం లేని చోట రోడ్డును నిర్మించి తమకు అన్యాయం చేశాడని దళిత కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. దళితుల పట్ల వివక్షతో రోడ్డు నిర్మాణం చేపట్టలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం జరగని ప్రాంతంలో రహదారి గుంతల మయంగా మారింది. గుంతల్లో రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడాల్సి వస్తుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి విషయం గురించి పిఆర్ ఎఇ రామచంద్రరావును వివరణ కోరగా అద్దేపల్లి రోడ్డు నిర్మాణ పనులు నిలిపివోవడంతో ఆ నిధులు వేరేచోట వినియోగించినట్లు తెలిపారు. మళ్లీ నిధులు మంజూరైతే అద్దేపల్లిలో నిలిచిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.


నిర్మాణం నిలిచిన రోడ్డు ఇదే

స్థలం కేటాయించాలని వినతి

భట్టిప్రోలు : భట్టిప్రోలులో బిఆర్. అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ వేమూరు నియోజకవర్గ దళిత సంఘం నాయకులు తహశీల్దారు, ఎంపిడిఒలకు బుధవారం వినతిపత్రం అందజేశారు. స్థానిక బౌద్ధ స్థూపం ఎదురుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఉన్న ఖాళీ స్థలంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని నియోజకవర్గ దళిత రాజ్యం నాయకులు పి.మోజేష్ కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

కనిగిరి : పదవతరగతి కష్టపడి చదివి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు,తల్లితండ్రులకు ,ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని వ్యాపారవేత్త నాదెళ్ల తిరుపతిరావు తెలిపారు. మండల పరిధిలోని పాతపాడు జడ్‌పి ఉన్నత పాఠశాలలో పదవతరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షా సామగ్రి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసాచారి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి వ్యాపారవేత్త నాదెళ్ల తిరుపతిరావు అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చిన్న వెంకటరెడ్డి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

ఇంకొల్లు రూరల్ : ఇంకొల్లు-గొల్లపాలెం రహదారిలో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో గొల్లపాలెం వార్డు సభ్యుడు వెనిగండ్ల శ్రీకాంత్ తన సొంత నిధులతో గుంతలకు బుధవారం మరమ్మతులు చేయించాడు. రహదారిపై గుంతలు ఏర్పడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన వార్డు సభ్యులు శ్రీకాంత్ స్వచ్ఛందంగా తన సొంత నిధులు వెచ్చించి గుంతలను పూడ్చించాడు.

'వెలిగొండ' కాలువ పరిశీలన


ప్రజాశక్తి-వెలిగండ్ల

వెలిగొండ ప్రాజెక్టు కాలువను వెలిగండ్ల టిడిపి నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కావాలన్నా, ఈ ప్రాంతం సస్యశామలం కావాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడును గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, నాయకులు మోటాటి సుబ్బారెడ్డి, ఆవుల మాలకొండారెడ్డి, వెన్నా రమణారెడ్డి, టిడిపి గ్రామ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, తెలుగు రైతు అధ్యక్షుడు నరసింహారెడ్డి, ముక్కు వెంకటేశ్వర్లురెడ్డి, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షుడు వెంగటయ్య, ఎస్‌సి నాయకులు గోనా చక్రి, బాను సుబ్బారెడ్డి, ఐటిడిపి నాయకుడు నాగరాజు, చిన్ననాగయ్య, విజయ్, చిన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

వధూవరులకు గొట్టిపాటి శుభాకాంక్షలు

ప్రజాశక్తి- పంగులూరు

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బుధవారం జరిగిన పలు కార్యక్రమాల్లో అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు. తొలుత చినమల్లవరం గ్రామంలోని తొండెపు రామాంజనేయులు, పద్మావతి దంపతుల కుమారుడి వివాహం రెండు రోజుల క్రితం జరగగా నూతన వధూవరులను ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చినమల్లవరం మాజీ సర్పంచి గోవిందమ్మ భర్త టిడిపి నాయకుడు వెంకటేశ్వరరావు (కె.వి.ఆర్) రెండు రోజుల క్రితం గుండెపోటుతో మరణించగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉప్పలమర్తి రామారావు కొన్ని రోజుల క్రితం గుండె శాస్త్ర చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన పరామర్శించి ఆరోగ్య విషయం వాకబు చేశారు. అనంతరం నార్నేవారి పాలెంలో రావిపాటి చిన వెంకయ్య కిడ్నీ సమస్యతో బాధపడుతుండగా ఆయన పరామర్శించారు. అదే గ్రామానికి గుంటుపల్లి సుబ్బాయమ్మ దశదిన కార్యక్రమానికి హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రావూరి రమేష్, నాయకులు ఉక్కపల్లి ఏడుకొండలు, మాజీ జడ్‌పిటిసి కరీ వెంకట సుబ్బారావు, సుబ్బారావు ,అధ్యక్షుడు చింతల సహదేవుడు, డెయిరీ మాజీ చైర్మన్ బాలిన రామ సుబ్బారావు పాల్గొన్నారు.


వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

మెడికల్ కిట్లు అందజేత

జరుగుమల్లి : మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, సాంకేతిక సహాయకులు, ఇంజినీరింగ్ సిబ్బందితో ఉపాధి పనులపై ఎంపిడిఒ రామకృష్ణ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పని కల్పనలో నిర్దేశించిన లక్ష్యాని పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లకు మెడికల్ కిట్లు అందజేశారు. అనంతరం మండల పరిధిలోని పైడిపాడు, తూమాడు గ్రామ సచివాలయాలను సందర్శించారు. సచివాలయ సిబ్బంది ఫేస్‌యాప్‌లో ఉదయం సాయంత్రం నిర్ణీత సమయాలలో హాజరు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ కె.నాగరాజు, తూమాడు సచివాలయ కార్యదర్శి మౌనిక, పైడిపాడు కార్యదర్శి రజని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శివనగర్‌లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-కనిగిరి

ప్రజాశక్తి కథనానికి స్పందన

కనిగిరి మున్సిపాలిటీ 2వవార్డు పరిధిలోని శివనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలపై శివనగర్ కాలనీపై చిన్నచూపు అనే శీర్షికతో బుధవారం ఓ కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించారు. కాలనీలో పారిశుధ్య పనులు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ నారాయణరావు,శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు కాలనీలో పర్యటించి ప్రజల అడిగి వారి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సచివాలయ సిబ్బందికి తగు సూచనలు చేశారు. సచివాలయ సిబ్బంది సమస్యలపై నిర్లక్ష్యంగా సమాధానం చెప్పటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేసి నిలదీశారు. కాలనీలో మౌలిక వసతులు లేక అల్లాడుతుంటే నెలలు తరబడి పట్టించుకోరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీలో నెలకొన్న పారిశుధ్య,నీటి,మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టకపోతే మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కాలనీలోని సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు స్థానికులకు సర్ది చెప్పారు.


సచివాలయ సిబ్బందిని నిలదీస్తున్న ప్రజలు

పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లులోని పోలింగ్ కేంద్రాలను జోనల్ ఆఫీసర్ బివి. రమణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రాడ్యుయేట్స్ మరియు టీచర్స్ పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిటి లక్ష్మీకుమారి, ఎఎస్ఓ పుష్పలత, విఆర్‌ఒలు సురేష్, కృష్ణప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమోజిపాలెంలో నేత్రదానం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

మండల పరిధిలోని హనుమోజిపాలెంలో బుధవారం నేత్రదానం చేశారు. గ్రామానికి చెందిన ఆలూరి సీతారావమ్మ (95) మృతి మృతి చెందింది. కుటుంబ సభ్యులు సీతారామమ్మ నేత్రాలను దానం చేశారు. గుంటూరు శంకర కంటి వైద్యులు హనుమోజిపాలెం వచ్చి సీతారావమ్మ కార్నియాలను సేకరించారు. ఈ సందర్భంగా అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహన్‌రావు, జట్టి వెంకటేశ్వర్లు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బి.అంజిరెడ్డి, కరి కమలేశ్వరరావు తదితరులు సీతారావమ్మ కుటుంబ సభ్యులు సుబ్బారావు, కోటేశ్వరమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి-యద్దనపూడి

మండల పరిధిలోని యద్దనపూడి గ్రామంలో నవతరం పార్టీ సమావేశం మండల అధ్యక్షుడు వెంకట సుబ్బారావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పదవులకు నియమితులైన వారికి జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయి జ్యోతిబాబు, చెరుకూరి సుబ్బారావు, కొణతం ఇస్సాకు,దుర్గారావు, వెంకటేశ్వర్లు,పి.శ్రీను,కె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సైకో పాలన అంతం కావాలి : టిడిపి

ప్రజాశక్తి-పామూరు

రాష్ట్రంలో వైసిపి సైకో పరిపాలన అంతం కావాలని టిడిపి నాయకుడు, మాజీ జడ్‌పిటిసి బొల్లా మాల్యాద్రి చౌదరి తెలిపారు. స్థానిక టిడిపి కార్యకర్తలతో ప్రభాకర్ అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి చౌదరి మాట్లాడుతూ గన్నవరంలో వైసిపి నాయకులు టిడిపి కార్యాలయం పై దాడులు చేసి ఫర్నిచర్ ధ్వంసం చేసినట్లు తెలిపారు. నిందితులపై కేసులు పెట్టడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపించారు ఈ కార్యక్రమంలో రహంతుల్లా, ఇరి కోటిరెడ్డి, అమీర్ బాబు, రమణయ్య, గౌస్ బాషా, శ్రీనివాసులు, నాగరాజు, సుబ్బారావు, మాల్యాద్రి, మాల కొండయ్య, హుస్సేన్ రావు యాదవ్ పాల్గొన్నారు

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-పామూరు

పామూరుకు చెందిన ఆర్. కష్ణ మోహన్ కుమార్తె వివాహవేడుకలు బుధవారం జరిగాయి. ఈ వేడుకల్లో టిడిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి మరియు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహ రెడ్డి పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రహంతుల్లా, ఇరి కోటిరెడ్డి, అమీర్ బాబు, రమణయ్య, గౌస్ బాషా, శ్రీనివాసులు, నాగరాజు, సుబ్బారావు, మాల్యాద్రి, మాలకొండయ్య, హుస్సేన్ రావు యాదవ్ పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలులోని బౌద్ధ స్థూపం ఎదురుగా పిహెచ్‌సి ఎదుట ఉన్న ఖాళీ స్థలంలో స్వామి వివేకానంద విగ్రహ సాధన కమిటీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద,సుభాష్ చంద్రబోస్,అల్లూరి సీతారామరాజు విగ్రహాల ఏర్పాటుకు బుధవారం శంకుస్థాపన చేశారు. సర్పంచి దారా రవి కిరణ్మయి, మాజీ జడ్‌పిటిసి బండారు కుమారి దంపతులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో చెన్న ఉమా మహేశ్వరరావు, సి.రామకోటేశ్వరరావు, ననగపల్లి నరసింహారావు ,తెల్లప్రోలు శ్రీనివాస్, బుర్లే రాంప్రసాద్, రామనాథం రామకష్ణ పాల్గొన్నారు.

నీళ్లపై నిర్లక్ష్యమేల..?

- ఒంగోలుకు వదలాల్సిన దాంట్లో సగం కూడా ఇవ్వని ఎన్ఎస్‌పి అధికారులు
- మెతకవైఖరిలో ఒఎంసి అధికారులు



సమ్మర్‌స్టోరేజి ట్యాంకును పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

సాగర్ జలాలను సమ్మర్ స్టోరేజీ ట్యాంకులకు నింపుకోవడంలో ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వేసవి సమీపిస్తున్న వేళ తాగునీరు సరిపడా ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది. ఈ పాటికే రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీరు నిండుకుంది. నిల్వలు డెడ్ స్టోరేజీకి పడిపోయాయి. ఈ క్రమంలో మూడు రోజుల కిందట ఎన్ఎస్‌పి అధికారులు సాగర్ నీటిని రామతీర్థం జలాశయం నుంచి ఒంగోలు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులకు విడుదల చేశారు. రోజుకు వంద క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తే నగరంలోని రెండు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను సంవృద్ధిగా నింపుకునేందుకు సుమారు 25 రోజులు సమయం పడుతుంది. అయితే ప్రస్తుతం ఎన్ఎస్‌పి అధికారులు కేవలం 40 క్యూసెక్కుల నీటిని మాత్రమే ఒంగోలుకు ఇస్తున్నారు. ఇందులో 10 క్యూసెక్కుల నీరు కాల్వల్లో ఇంకిపోవడం, ఆవిరి అయిపోవడం జరుగుతోంది. మిగిలిన 30 క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రస్తుతం రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు వస్తుంది. 100 క్యూసెక్కుల నీరు ఇస్తే కాల్వలు, పైప్‌లైన్‌ల ద్వారా రెండు చెరువులకు ఏక కాలంలో నింపుకునే అవకాశం ఉంది. నీటి పరిమాణం తగ్గించడంతో ఇప్పుడు ఒక్క చెరువుకు మాత్రమే నీటిని పెడుతున్నారు. ప్రస్తుతం వస్తున్న పరిమాణం ప్రకారం రెండు చెరువులు నిండాలంటే కనీసం మూడు మాసాలైన సమయం పడుతోందని కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది చెబుతున్నారు. అన్ని రోజులు సాగర్‌నీరు దిగువకు వదులుతారా..? అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. రామతీర్థంలో సాగర్‌నీరు సంవృద్ధిగా అందుబాటులో ఉన్నప్పుడే వాటా ప్రకారం ఒంగోలుకు ఇవ్వాల్సిన నీరు సకాలంలో ఇవ్వాలని పలువురు కార్పొరేటర్లు కోరుతున్నారు. ప్రస్తుతం రెండు సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో ఉన్న నీరు రెండు మాసాలకు సరిపడా ఉందని, సాగర్‌నీటితో చెరువులను నింపే కార్యక్రమం ప్రారంభమైందని కార్పొరేషన్ ఇంజనీర్ కె.మాల్యాద్రి 'ప్రజాశక్తి'కి తెలిపారు.

ఈ నేపథ్యంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు బుధవారం రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకును సందర్శించారు.

బలమైన కమ్యూనిస్టు ఉద్యమం నిర్మించటమే

చెంచయ్యకు ఇచ్చే ఘన నివాళి

నివాళులర్పించిన సిపిఎం నేతలు



తవనం చెంచయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బలమైన కమ్యూనిస్టు ఉద్యమం నిర్మించటమే తవనం చెంచయ్యకు ఇచ్చే ఘనమైన నివాళి అని పలువురు సిపిఎం నేతలు పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో బుధవారం తవనం చెంచయ్య 9వ వర్థంతి సందర్భంగా సిపిఎం నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌డి హనీఫ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై.సిద్దయ్య మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమం ప్రారంభ సందర్భంగా తీవ్రమైన నిర్బంధం కొనసాగేదని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఉధృతమైన పోరాటాలు జరిగాయన్నారు. ముఖ్యంగా వ్యవసాయ కార్మికుల పోరాటాలు బాగా జరిగాయని, పోరాటాలను ముందుండి నడిపిన వారిలో తవనం చెంచయ్య ఒకరని తెలిపారు. తవనం చెంచయ్య ప్రాసంగులపాడు గ్రామంలో పేద వ్యవసాయ కుటుంబంలో జన్మించారని, ఆ గ్రామంలో రైతులు, వ్యవసాయ కార్మికులను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించి కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నిర్మాణంలో ముఖ్యపాత్ర పోషించారన్నారు.. నేడు ప్రజలు కష్టాలలో ఉన్నారని, పేదలపై దాడులు, ఆర్థిక భారాలు ఎక్కువయ్యాయని, సంపన్నులు మరింత సంపన్నులుగా మారుతున్నారన్నారు. క్లిష్టమైన సమయాలలో పార్టీని చెంచయ్య ముందుండి నడిపారని, నేటి రాజకీయ నాయకులు, పార్టీ కార్యకర్తలు వారి ఆశయాన్ని ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. సిపిఎం రాష్ట్ర నాయకులు పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ తవనం చెంచయ్య కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగానే కాకుండా ప్రజా నాయకుడిగా ఎదిగారని, ప్రజల మన్ననలను పొందారన్నారు. చెంచయ్యను అన్ని పార్టీల వారు అభిమానిస్తారని జిల్లా ప్రజలకు అమోదయోగ్యమైన నాయకుడిగా ఎదిగారన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని, జిల్లాలోని సమస్యలను శాసనసభలో వినిపిస్తూ, నీతి, నిజాయితీగా ఉన్నారన్నారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలం మంజూరు చేసినా సిద్ధాంతాలకు కట్టుబడి దానిని తిరస్కరించారని కొనియాడారు. చనిపోయే వరకు అద్దె ఇంటిలోనే నివసించిన గొప్ప నాయకుడన్నారు. చెంచయ్య పార్టీ పోరాటాలతో పాటు సమాజం పట్ల నిబద్ధత ప్రజలంటే గౌరవంగా ప్రజల అమోద యోగ్యమైన జీవితం తాను జీవించడానికి కషి చేశాడన్నారు. తవనం చెంచయ్యకు నివాళి అర్పించడమంటే ఆయన అడుగుజాడల్లో నడుస్తూ జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలంగా నిర్మించడమే ఘనమైన నివాళని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె మాబు, జివి కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, డి.సోమయ్య, యం.రమేష్, వెల్లంపల్లి ఆంజనేయులు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎంను కలిసిన వీసీ అంజిరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



సిఎంను కలిసిన వీసీ

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డిని కొత్తగా నియమితులైన ఒంగోలు ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ మారెడ్డి అంజిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సిఎం క్యాంపు కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రిని కలిసిన ఆయన యూనివర్సిటీ అభివృద్ధికి సహకరించవలసిందిగా అభ్యర్థించగా, అందుకు సిఎం సుముఖత వ్యక్తం చేశారు.

'స్వధార'కు వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా ముస్లిం రచయితల సంఘం ఆధ్వర్యంలో ఒంగోలులోని హౌసింగ్‌బోర్డ్ లో ఆంధ్రప్రదేశ్ మహిళా అభ్యుదయ సమితి ఆధ్వర్యంలో నడుపుతున్న 'స్వధార గృహ'లో వస్తువులు పంపిణీ చేశారు. ముస్లిం రచయితల సంఘం అధ్యక్షులు షేక్ మహబూజాన్, షేక్ హుమాయిన్ స్వధార గహలోని నివాసితులకు 'ఫాతిమా అజిమ బేగం చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో గ్లాసులు, కంచాలు, కప్పులు అందజేశారు. షేక్ మహబూబ్ జాన్ వివాహ వార్షికోత్సవ సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

కోలాహలంగా పిడిఎఫ్ అభ్యర్థుల నామినేషన్

- గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా మీగడ..ఉపాధ్యాయ అభ్యర్థిగా బాబురెడ్డి
- భారీగా తరలివెళ్లిన ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాల కార్యకర్తలు



నామినేషన్ వేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ అభ్యర్థి వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి బాబురెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

పిడిఎఫ్ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమం చిత్తూరులో బుధవారం నాడు కోలాహలంగా జరిగింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బాబురెడ్డి నామినేషన్లు వేశారు. ప్రస్తుత పిడిఎఫ్ ఎమ్మెల్సీలు విఠపు బాల సుబ్రమణ్యం, కేఎస్ లక్ష్మణరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చిత్తూరు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వీధుల్లో ఉపాధ్యాయులు, ప్రజాసంఘాల కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మరోసారి పిడిఎఫ్ అభ్యర్థులదే విజయం అన్నట్లుగా రాజకీయ పార్టీల అభ్యర్థులకు భిన్నంగానూ, ప్రత్యామ్నాయంగా నామి నేషన్ కార్యక్రమం జరిగింది. పట్టణంలో పిడిఎఫ్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ సాగిన ర్యాలీ అందరినీ ఆకట్టుకుంది. ఎటువంటి హంగూఆర్భాటాలు లేకుండా రహదారుల్లో నడుకుంటూ ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేశారు. అక్కడ నుంచీ మళ్లీ ర్యాలీగా విద్యారంగంపై జరిగిన సదస్సు ప్రాంగణానికి చేరుకున్నారు. ముందు వరుసలో అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మెల్సీలు, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు. పిడిఎఫ్ విద్యారంగంపై ఎలాంటి వైఖరితో ఉందో ఎమ్మెల్సీలు బాలసుబ్రమణ్యం, లక్ష్మణరావు వివరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, యువజన, విద్యార్థి, ప్రజాసంఘాల జేఏసీ నేతృత్వంలో సదస్సు జరిగింది. అన్ని రంగాల సంఘాల నేతలు పాల్గొన్నారు. పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని నేతలు ప్రసంగించారు. నామినేషన్ కార్యక్రమానికి జిల్లాల నుంచి భారీగా ఉపాధ్యాయులు, జేవీవీ, సిఐటియు, విద్యార్థి యువజన సంఘాలు, మహిళా సంఘాల నేతలు, ఇతర ప్రజాసంఘాల నేతలు. కార్యకర్తలు తరలివెళ్లారు. గ్రాడ్యుయేట్ అభ్యర్థి కనిగిరికి చెందిన నేత కావడంతో ఈ ప్రాంతం నుంచి బస్సులు, వాహనాల్లో తరలివెళ్లారు. కనిగిరి నియోజకవర్గం నుంచి అన్ని మండలాల నుంచి కదిలారు. యుటిఎఫ్ జిల్లా నాయకులు తరలివెళ్లారు. తెలుగుదేశం, వైసిపి నుంచి గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు పోటీచేసే అభ్యర్థులు కూడా బుధవారం నాడు నామినేషన్లు వేశారు. వారంతా ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతో కలిసి వాహనాలు, కార్లతో ర్యాలీలు పెట్టారు. వారికి మద్దతుగా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలి

- భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహదం
- జాయింట్ కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్
- ఘనంగా జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్



ఎగ్జిబిట్లను తిలకిస్తున్న జెసి అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

శాస్త్రీయ దక్పథంతో పాటు వైజ్ఞానిక అంశాలపై ఆసక్తి కలిగి ఉండడంతో భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోపద పడుతుందని విద్యార్థులకు సంయుక్త కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ దిశా నిర్దేశం చేశారు. బుధవారం ఒంగోలులోని స్థానిక సెయింట్ జేవియర్స్ హైస్కూల్‌లో బుధవారం పాఠశాల విద్యాశాఖ, ఎస్‌సిఆర్ఇటి సంయుక్తంగా జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ముగింపు వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెసి విద్యార్థులు తయారు చేసిన పలు ప్రాజెక్టులను ఆసక్తిగా తిలకించి వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 38 మండలాలలోని పాఠశాలల్లో, మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు జిల్లా స్థాయిలో వారు ఈ ప్రాజెక్టను ప్రదర్శించారన్నారు.. జిల్లా స్థాయిలో 5 విభాగాలలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులు ఈ నెల 28వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. తాను చదుకున్న రోజులను గుర్తు చేసుకుంటూ తాను కూడా 9, 10వ తరగతి చదివే రోజుల్లో చిత్తూరులోని లిటిల్ ఫ్లవర్ స్కూల్లో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫేర్ పోటీలలో పాల్గొన్నానని తెలిపారు. జిల్లా విద్యా శాఖ అధికారి పి.రమేష్ మాట్లాడుతూ నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు సుమారు 12 వేల మంది ఎగ్జిబిట్లను తిలకించారన్నారు. నగరంలోని క్విజ్, రైజ్ ఇంజనీరింగ్ కళాలల నుంచి వచ్చిన అధ్యాపకులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి ఎగ్జిబిట్లను పరిశీలించి, ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేశారన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జెసి జ్ఞాపిక, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో పిఇఒ సామా సుబ్బారావు, ఒంగోలు, మార్కాపురం ఉప విద్యాశాఖ అధికారులు అనితారోజ్ రాణి, చంద్రమౌళీశ్వర్, జిల్లా సైన్స్ అధికారి టి.రమేష్ బాబు, సమగ్ర శిక్ష ఏఎంఒ సుబ్బారావు, ఎంఇఒ టి.కిషోర్ బాబు, సెయింట్ జేవియర్స్ స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ వేలాంగని మేరీ పాల్గొన్నారు.

మెస్ ఛార్జీలు రూ.2500కు పెంచాలి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, సంక్షేమం, గురుకుల హాస్టల్‌లలో చదువుతున్న విద్యార్థుల మెస్ ఛార్జీలు నెలకు రూ.2500కు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమం, గురుకుల హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు 3, 4 తరగతులకు రూ.1150, 5-10 తరగతులకు 1400, ఇంటర్ ఆ పై చదువులకు విద్యార్థులకు రూ.1600 పెంచినట్టు ప్రకటించిందన్నారు. మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచి ఐదు సంవత్సరాలు అవుతుందని, ఈ ఐదేళ్ళలో నిత్యావసర సరుకుల ధరలు ప్రతిరోజూ పెరిగాయన్నారు. కరోనా తర్వాత నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మెస్ చార్జీలు నామమాత్రంగా పెంచిందన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో సంక్షేమ హాస్టల్లో పౌష్టికాహారం అందాలంటే నెలకి 2500 రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.